నల్లగొండ వార్త
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి
గురువారం 26, మార్చి 2026 16 పేజీలు






2 లో..

# డీలర్లకు భారమైన.. భద్రత

ప్రభాతవార్త, నడిగూడెం, (సూర్యాపేట) : చౌక ధరల దుకాణాలకు ఏళ్ల తరబడి దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. ఈ బియ్యాన్ని డీలర్ల నుండి రేషన్ కార్డు లు కలిగిన వినియోగదారులు బియ్యం తీసుకొని పక్కదారి పట్టించారు. దొడ్డు బియ్యం వ్యాపారంగా మారింది. దొడ్డు బియ్యం వ్యాపారం చేసే మాఫియా తయారు కావడంతో అక్రమ అమ్మకాలు, కొనుగోళ్ల నియంత్రణ కు ఒకవైపు పోలీస్ శాఖ మరోవైపు పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. అందుకు బాధ్యులైన వారిపై కేసులు కూడా నమోదు చేశారు. పిడి యాక్ట్ అమలు చేశారు. అయినప్పటికీ దొడ్డు బియ్యం అమ్మకాల మాఫియా ఆగ డాలకు అడ్డు అదుపు లేకపోవడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. దొడ్డు బియ్యం సరఫరా నిలిపి వేయించి సన్న బియ్యం తెల్లకార్డులు కలిగిన వారందరికీ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.



**పురుగుల పాలైన దొడ్డు బియ్యం**

**సన్న బియ్యానికి పురుగులు పట్టకుండా చర్యలు**

**సంవత్సర కాలంగా డీలర్లకు తప్పని తిప్పలు**

**ప్రభుత్వ ఆదేశాలకై ఎదురుచూపులు**



ఈ నేపథ్యంలోనే 2025 మార్చి 30న ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజూర్నగర్ లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి సన్న బియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారు. కొత్తగా అర్హులైన వారికి రేషన్ కార్డులు కూడా పంపిణీ చేశారు. సంవత్సర కాలంగా సన్న బియ్యం పంపిణీ

## నల్గొండ జిల్లాలో పెట్రోల్, డీజిల్,ఎల్పిజి గ్యాస్‌కు కొరత లేదు

**ఆందోళనతో వినియోగదారులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయవద్దు**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ ప్రభాత వార్త మార్చి 25 జిల్లాలో ఎల్పి జి గ్యాస్, పెట్రోలు, డీజిల్ కు ఎలాంటి కొరతలేదని ,అందువల్ల జిల్లా ప్రజలు ఆందోళనతో అధిక మొత్తంలో పెట్రోల్ ,డీజిల్ గ్యాస్ కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.



2వ పేజీలో..

జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో పెట్రోల్ బంకుల వద్ద పెట్రోలు, డీజిల్ కొరత ఉందని, అంతేకాకుండా ఎల్పిజి కొరత ఉందంటూ సోషియల్ మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఎల్ పి జి, పెట్రోల్ ,డీజిల్ సరఫరా పై బుధవారం అయన పౌరసరఫరాల అధికారులు, పెట్రోల్, డీజిల్ ,ఎల్ పి జి సరఫరా దారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో



## ప్రపంచవ్యాప్తంగా పోచంపల్లి వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు

**కలెక్టర్ అనురాగ్ జయంతి**



2లో..

## స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు

**యాదగిరిగుట్ట మార్చి 25 (ప్రభాతవార్త):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి అమ్మ వార్లకు విశేష పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో ఆలయ అర్చకులు చదివే వేదమంత్రాలుతో అభిషేకం గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు గర్భాలయంలో వివిధ రకాల పుష్ప మాలికల



2వ పేజీలో..



2 లో..

## ఇసుక అక్రమ రవాణా ఆపేదెవరు..?

**పట్టించుకోని అధికారులు**

**కాయలు అన్న చందంగా**

మోతె, ప్రభాతవార్త... మోతె మండలంలో పాలేరు వాగులో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతోంది. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గత కొద్ది రోజులుగా ఇసుక దందా మూడు పువ్వులు.. ఆరు



**అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు : తహసిల్దార్ వెంకన్న, మోతె**

పాలేరు వాగులో ఇసుక రవాణా కు ఎలాంటి అనుమతులు లేవని, ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని, అక్రమ ఇసుక రవాణా చేసిన వారిపై చట్టమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆగని అక్రమ డిప్యూటేషన్లు

**అటకెక్కుతున్న ఆరోగ్య మహిళా వైద్య సేవలు**

**గాడి తప్పుతున్న ప్రభుత్వ లక్ష్యం**

**చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం**

**"ఆమె" కు " అతని" వైద్యం...!**

**మహిళా వైద్యుల బదిలీ తగ్గిపోతున్న మహిళ రోగుల సంఖ్య**

**గొప్ప ఆశయం... లక్ష్యం ఆమడ దూరం**

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త : మహిళల ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమం జిల్లాలో అమలులో తీవ్ర అంతరాయాలు ఎదుర్కొంటోంది. మహిళల కోసమే ఏర్పాటు చేసిన కేంద్రాల్లో




2లో..

మహిళా వైద్యులు అందుబాటులో ఉండాల్సి ఉండగా, కొన్ని చోట్ల పురుష వైద్యులు సేవలు అందించడం పట్ల సర్వత్ర విమర్శలు వెలు వెత్తుతున్నాయి. దీంతో మహిళలు తమ వ్యక్తిగత ఆరోగ్య సమస్యలను చెప్పడంలో సంకోచానికి గురవుతూ, ఆసుపత్రులను దూరం చేసుకుంటున్నారు. ఇప్పటికే

## డీలర్లకు భారమైన భద్రత

**మొదటి పేజీ తరువాయి..**

జరుగుతుంది. ప్రజలంతా సంతోషంగా చౌక ధరల దుకాణాల నుండి సన్నబియ్యాన్ని తెచ్చుకొని వండుకొని తింటున్నారు. కానీ సంవత్సర కాలంగా దొడ్డు బియ్యం మాత్రం చౌక ధరల దుకాణాల్లో నిల్వ ఉంటున్నాయి. వీటి విషయంలో నేటి వరకు ప్రభుత్వము, పౌర సరఫరాల శాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడంతో డీలర్లు దొడ్డు బియ్యాన్ని భద్రపరచలేక నానా అవస్థలు పడుతున్నారు. వీటి భద్రత భారంగా తయారైందని వాపోతున్నారు. దొడ్డు బియ్యం పురుగుల పాలవుతున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతకాలం భద్రపరచాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా డీలర్లు దొడ్డు బియ్యం నిల్వలకు భద్రత కరువు అవుతుందని వాపోతున్నారు. సన్న బియ్యం పంపిణీ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి ఆదరణ లభించడంతో విజయవంతంగా కొనసాగిస్తున్నారు. కానీ చౌక ధరల దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం గురించి ఎవరు పట్టించుకోవడంలేదని అంటున్నారు. చౌక ధరల దుకాణాల్లో ఉన్న సన్న బియ్యానికి కూడా పురుగులు పట్టే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో దాదాపు 13 కోట్ల రూపాయల పైబిలుకు దొడ్డు బియ్యం పురుగుల పాలయ్యాయి. సూర్యాపేట జిల్లాలో 12,185 క్వింటాళ్ల దొడ్డు బియ్యం, నల్లగొండ జిల్లాలో 9,545 క్వింటాళ్ల దొడ్డు బియ్యం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 16 వేల క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వ ఉంది. ఒక దశలో దొడ్డు బియ్యం వేలం వేయాలని ప్రభుత్వము యోచించినప్పటికీ అమలులో కార్యరూపం దాల్చలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా పరిస్థితి తయారైంది. సంవత్సర కాలంగా దొడ్డు బియ్యం విషయమై స్పష్టమైన ఆదేశాలు రాకపోవడం శోచనీయమని పలువురు డీలర్లు అంటున్నారు.

సూర్యాపేట జిల్లాలో 610 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. ముక్క వాసన వస్తున్నాయని, సన్న బియ్యం తీసుకునేందుకు వస్తున్న తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు ముక్కు మీద వేలేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దొడ్డు బియ్యం నిల్వల విషయమై చౌక ధరల దుకాణాల డీలర్లు ఎన్నో పర్యాయాలు ఆయా మండలాల తాసిల్దార్లకు విన్నవించారు. సమావేశాల్లో కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదని తాసిల్దారులు సమాధానం ఇవ్వడంతో డీలర్లు కూడా మౌనం వహించక తప్పలేదు. కానీ క్షేత్రస్థాయిలో డీలర్లు మాత్రం దొడ్డు బియ్యం భద్రత విషయంలో మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## నల్గొండ జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పిజి గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు

**మొదటి పేజీ తరువాయి..**

సరిపడినంత పెట్రోల్, డీజిల్ తో పాటు,ఎల్ పి జి గ్యాస్ నిలువలు ఉన్నాయని, అయితే వినియోగదారులు వదంతులను నమ్మి ఆందోళనతో ఎక్కువ మొత్తం కొనుగోలు చేస్తున్నారని అలా చేయవద్దని ఆయన కోరారు. సరిపోయినంత పెట్రోల్,డీజిల్,ఎల్ పి జి నిలువలు ఉన్నందున పెట్రోల్ , డీజిల్ బంకులు ,ఎల్పిజి సరఫరా గోడౌన్ ల వద్ద ఎలాంటి నో స్టాక్ బోర్డులు పెట్టకూడదని చెప్పారు. ఎల్పిజి గ్యాస్, పెట్రోల్, డీజిల్ సక్రమ సరఫరాకై పోలీసులతో పాటు, గ్రామ పాలనా అధికారులు, కారోబార్లతో పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా దారులకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఎల్పిజి సిలిండర్ల సరఫరాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ఎల్పిజి స్టాక్ నియంత్రణలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే పెట్రోలు, డీజిల్ కు కూడా ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై జిల్లాలోని ఇంధన సరఫరాదారులు వారి డీలర్లకు కూడా అవగాహన కలిగించాలని, రానున్న మూడు, నాలుగు రోజులు అతి ముఖ్యమని ,ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉంటూ జిల్లాలో ఎల్పిజి, పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ పెట్రోల్, డీజిల్, ఎల్పిజి సక్రమ సరఫరాకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్డీవోలు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్, పౌరసరఫరాల అధికారులు మాట్లాడారు

## ఇసుక అక్రమ రవాణా ఆపేదెవరు..?

**మొదటి పేజీ తరువాయి..**

కొనసాగుతుంది. మోతె మండలంలోని కూడలి, రంగాపురం తండా, రావికుంట తండా, నరసింహపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, అన్నారి గూడెం గ్రామాల వెంట సుమారు 10 కిలోమీటర్ల మేర ప్రవహించే పాలేరు వాగులో నిండా నీరు ఉన్నప్పటికీ చేపలు పట్టే తెప్పల సహాయంతో ఇసుకను తోడి వంతెన పైకి తరలిస్తున్నారు. వంతెనపై ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడి నుంచి ఇసుక ను ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా లక్షల్లో సంపాదిస్తున్నట్లు సమాచారం. రాత్రింబవళ్ల ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో గ్రామాల్లో . రహదారులు ఛిద్రమవుతు న్నాయని జనం గగ్గోలు పెట్టిన పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు. మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ లు లేకపోవడం తో అక్రమార్కులు కలిసి వచ్చింది. ఇటీవలే మండలము లోని కూడలి గ్రామంలో ఆక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక దంపులను సైతం అధికారులు సీజ్ చేసినా,ఇసుక అక్రమ రవాణా చేస్తున వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. ఉర్లుగొండ-నరసింహ పురం గ్రామాల మధ్య రూ.2 కోట్ల తో నిర్మించిన వంతెన కింద జోరుగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. దీంతో పిల్లర్లు బలహీన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా ఇసుక తవ్వకాల వల్ల భూగర్భజలాలు అందనంత లోతుకు వెళ్ళి తద్వారా సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు

**మొదటి పేజీ తరువాయి..**

తో శోభాయమానంగా అలంకారం చేసి విశేష కళ్యాణం ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే సాయంకాలం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై అధిష్టపజేసి మంగళ వాయిద్యాలతో ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు చేశారు. ఆలయంలో జరిగిన కళ్యాణోత్స వానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సుమారు గంట పాటు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరు వెంకటాచార్యులు, సురేంద్ర ఆచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, మాధవాచార్యులు, ఆలయ అధికారులు ఏఈఓ రఘు, చంద్రమౌళి, అర్చకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా పోచంపల్లి వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు

**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

భూదాన్ పోచంపల్లి,మార్చి25, ప్రభాతవార్త:



ప్రపంచవ్యాప్తంగా పోచంపల్లి వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉన్న నేపథ్యంలో చేనేత వస్త్రాలను టూరిజం హబ్ అభివృద్ధికి అవకాశం ఉన్నదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు, బుధవారం మున్సిపల్ కేంద్రంలోని టూరిజం పార్కును నేషనల్ ఇనిస్టూట్ ఆఫ్ అర్బన్ డెవలప్మెంట్ టీం తో కలిసి సందర్శించడం జరిగింది,అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.... చేనేత కళ అద్భుతంగా ఉందని చేనేత వస్త్రాలను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని చేనేత కార్మికులకు వారి యొక్క స్థితిగతులను ఆర్థిక పరిస్థితి బిజినెస్ ఏ విధంగా ముందుకు తీసుకు వెళ్ళాలో కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడారు, పోచంపల్లి పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను హెచ్ఎండిఏ అధికారులతో సమీక్షించి అక్కడ జరిగే పనులను త్వర త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు, టూరిజం మరియు చేనేత రంగాల అభివృద్ధికి ఒకదానికొకటి అనుసంధానమై ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించి మార్కెటింగ్ సదుపాయాలను విస్తరించి పోచంపల్లి టూరిజం మరియు చేనేత కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ ఏడి ఏ శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆగని అక్రమ డిప్యూటేషన్లు

**మొదటి పేజీ తరువాయి..**

పనిచేస్తున్న మహిళా వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం, సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపించడం వల్ల సేవలు మరింత దెబ్బతింటున్నాయి .ఒకే సిబ్బంది పలు కేంద్రాల్లో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడి, రోగులకు సరైన సమయంలో కేటాయించలేక పోతున్నారు. అనేక కేంద్రాల్లో వారానికి ఒకసారి నిర్వహించాల్సిన సేవలు కూడా సక్రమంగా జరగడం లేదని సమాచారం.సదుపాయాల కొరత కూడా తీవ్రంగా ఉంది. గర్భాశయ సంబంధిత వ్యాధులు, రక్తహీనత, థైరాయిడ్, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి కీలక పరీక్షలు పూర్తిస్థాయిలో అందడం లేదు.మహిళల గోప్యతకు అవసరమైన ప్రత్యేక గదులు లేకపోవడం మరో సమస్యగా మారింది. ఇతర రోగులతో కలిపి పరీక్షలు నిర్వహించడం వల్ల మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల కారణంగా ఆరోగ్య మహిళ కేంద్రాలకు వచ్చే రోగుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది.గ్రామస్థాయిలో ఈ కార్యక్రమంపై అవగాహన లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా విస్తృత ప్రచారం చేపడుతుండడంతో మహిళలు ఆరోగ్య మహిళ కేంద్రం వైపు దృష్టికి దృష్టి కేంద్రీకరిస్తున్నారు . కాగా అధికార యంత్రాంగం పర్యవేక్షణ ఆరోగ్య మహిళా కేంద్రాలపై లోపించడంతో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొక్కుబడి సేవలు అందుతున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు .సమీక్షలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మార్పులు కనిపించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. సిబ్బంది బదిలీలు, డిప్యూటేషన్లపై నియంత్రణ లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చుతోంది.ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని మహిళా వైద్యులను నియమించడం, ఖాళీలను భర్తీ చేయడం, అక్రమ డిప్యూటేషన్లపై కట్టడి విధించడం అవసరమని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రారంభించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం లక్ష్యం దూరమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**నెరవేరని లక్ష్యం..**

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య మహిళ వైద్యం పేరిట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు మెరుగైన సేవలందించేలా మహిళా దినోత్సవ పురస్కరించుకొని మార్చి 8,2023న పచ్చ జెండా ఊపింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 13ఆస్పత్రులను గుర్తించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోనిగుండాల, భువనగిరి పట్టణంలోని హన్మాన్ వాడ బస్తీ దవాఖాన,నల్లగొండ జిల్లాలోని డిండి, మర్రిగూడ, వేములపల్లి,కట్టంగూరు, నిడమనూరు, కేశరాజుపల్లి బస్తీ దవాఖాన,సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, త్రిపురారం, సూర్యాపేటపట్టణంలోని కుడకుడ బస్తీ దవాఖాన, యాపీఎస్సీ అంబేద్కర్ నగర్, పెన్ పహాడ్ ఆస్పత్రుల్లో సేవలను ప్రారంభించారు కొంతకాలం తర్వాత మరిన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళా సేవలకు విస్తరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరిగుట్ట, నారాయణపురం, పోచంపల్లి ,వలిగొండ మండలాల్లో ఆరోగ్య మహిళా సేవలను విస్తరించారు. కాగా ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్యం మహిళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా వైద్యులు లేకుండా కొనసాగుతున్నదంతో ప్రజల నుంచి కొంత విమర్శలు వెలువెత్తుతున్నాయి. కనీసం పక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందిస్తున్న మహిళ వైద్యులను ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో మహిళా డాక్టర్లు లేని కేంద్రాల్లో వైద్య సేవలు అందించేలా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అటువైపు దృష్టి సారించలేకపోతున్న తీరుపట్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజానీకం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగాజిల్లాలో అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ కార్యక్రమంలో'. భాగంగా 2023 మార్చి 8 నుంచి 2026 మార్చి 26 వరకు జిల్లాలోని ఆరు మండలాల్లో వేలాది మంది మహిళలు వైద్య సేవలను వినియోగించుకున్నారు.జిల్లాలో గుండాల మండలం అత్యధికంగా 11,631 మందికి సేవలు అందించి ముందంజలో నిలిచింది. యాదగిరిగుట్ట, బీబీనగర్ మండలాలు కూడా పది వేలకుపైగా లబ్ధిదారులతో మంచి ప్రదర్శన కనబరిచాయి. నారాయణపూర్ మండలంలో మాత్రం తక్కువ సంఖ్య నమోదైంది.

**కొసమెరుపు :**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వైద్య సేవలు అందించేలా నియమించబడ్డ ఎం ఎల్ హెచ్ పి మహిళా సిబ్బందిని సైతం విధుల్లో చేరిన కొద్ది రోజుల్లో డిప్యూటేషన్ లపై ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడంతో చివరకు వీరి సేవలు సైతం ఆరోగ్య మహిళా కేంద్రాల్లోని రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి

## టీజీ సెట్ ఫలితాలు డిండి విద్యార్థుల ప్రతిభ

డిండి, మార్చి 25, ప్రభాతవార్త,



మంగళవారం రోజున విడుదల చేసిన టీజీ సెట్ ఫలితాలలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల డిండి విద్యార్థులు తమ ప్రతిభను చూపించారు. ఈ ఫలితాలలో నాలుగో తరగతి విద్యార్థులు ఐదవ తరగతి కోసం పదిమంది వివిధ పాఠశాలల్లో సీట్లు సాధించారు. స్థానిక ఆర్ పి ఆర్ పి పాఠశాలలో 7 గురు విద్యార్థులు, బీసీ రెసిడెన్షియల్ నాగార్జునసాగర్ లో ఒక విద్యార్థి దేవరకొండ బీసీ రెసిడెన్షియల్ లో ఒక విద్యార్థి, మన్ననూరు సోషల్ వెల్ఫేర్ లో ఒక విద్యార్థి సీటు సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## గాయపడిన కాంగ్రెస్ నాయకుడు మద్ది భాస్కర్ రెడ్డికి పరామర్శ

నార్కట్ పల్లి ప్రభాతవార్త మార్చి 25



కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఏనుగులదోరి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మద్ది భాస్కర్ రెడ్డిని నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య పరామర్శించారు. బుధవారం భాస్కర్ రెడ్డి నివాసంలో ఆయనను కలుసుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేలానికి సిద్ధంగా గోశాల ఎద్దులు

డిండి, మార్చి 25, ప్రభాతవార్త,



డిండి మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ (శిరిడిసాయి) గోశాలయందు ఐదు ఎద్దులు, కోడెలు(గడేం/పని నేర్చినవి )వేలంపాటకు సిద్ధంగా ఉన్నాయని గోశాల కమిటీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం రోజున ఉదయం 7.00 గంటలకు గోశాల ప్రాంగణంలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని, అవసరమున్న రైతులు పాటలో పాల్గొనుటకు ఒక్కొక్క ఎద్దుకు రూ. 5వేల డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని, పాటలో ఎద్దును దక్కించుకున్న వారు డిపాజిట్ పోను మిగతా డబ్బులు చెల్లించి వెంటనే దానిని తీసుకెళ్లాలని, పాటలో ఎద్దులు కొనని వారికి వారి డిపాజిట్ వెంటనే తిరిగి ఇవ్వబడునని డిండి గోశాల కమిటీ నిర్వాహకులు వివరించారు.

## గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ చర్యలు..

### లింగోటంలో కల్వర్టు నిర్మాణానికి నిధుల మంజూరు

**నార్కట్ పల్లి ప్రభాతవార్త మార్చి 25**నార్కట్‌పల్లి మండలం లింగోటం గ్రామంలోని పోతినేనిపల్లె వెళ్లే దారిలో చెరువు నీరు చేరడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రైతుల సమస్యను ప్రాధాన్యతగా తీసుకున్నారు.ఈ మేరకు భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేసి కల్వర్టు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణంతో రైతుల రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు.ఈ చర్యపై గ్రామస్తులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు గడ్డం పశుపతి, గద్దగూటి యాదగిరి తదితరులు చురుకుగా స్పందిస్తూ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన అవశ్యం

డిండి యస్.ఐ. సిహెచ్ బాలకృష్ణ



**డిండి మార్చి 25, ప్రభాతవార్త,** మండల కేంద్రమైన డిండిలో బుధవారం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. బాలకృష్ణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా ప్రాణ రక్షణ సడక్ సురక్ష జీవన్ రక్ష కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలు జీబ్రా క్రాసింగ్ ఉన్నవొద్దనే రోడ్డు దా దాటాలని, అతివేగం ప్రమాదకరమని, నిదానమే ప్రధానమని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్న తదితరు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు హుస్సేన్, డేవిడ్ తదితరులు, ఆటో డ్రైవర్, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

## మార్తో 2026 లో ఎం జి యు బి టెక్ విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక

నార్కట్ పల్లి ప్రభాతవార్త మార్చ్ 25



ఎడ్యునేట్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్తో 20 26 పోటీలలో ఎంజియూ బీటెక్ సిఎస్సి, మూడవ సంవత్సరం విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక కావడం పట్ల ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అభినందనలు తెలిపారు. మూడు దశల్లో జరిగిన ఈ ఎంపికలో మొత్తం 560 టీములు పాల్గొనగా, ఫైనల్ ఎంపికకు 29 టీములలో ఎంజియూ విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక కావడం విశేషం. "సెక్యూర్ గ్రాఫ్ క్రిప్టో సిస్టం ఏ డి ఎస్ ఏ డ్రివెన్ మల్టీ లేయర్ ఎన్క్రిప్షన్ ఫ్రేమ్ వర్క్ " అంశంపై ప్రాజెక్టు ను డా ఎం జయంతి పర్యవేక్షణలో విద్యార్థులు కొనడా సాంబ ప్రసాద్ రెడ్డి,బి కార్తీక్, మాదిహ షాకూరు, సి హెచ్ మానస ప్రాజెక్టును సమర్పించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుసేన్ మాట్లాడుతూ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు స్వీయ అభ్యసనం,జిజ్ఞాస అలవడుతుందని, విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని అన్నారు.

## మైనర్ల డ్రైవింగ్‌పై నల్గొండ టూ టౌన్ పోలీసుల కఠిన చర్యలు

### తల్లిదండ్రులపై కేసులు తప్పవు

### ఎస్ఐ సైదులు హెచ్చరిక

**నల్గొండ టౌన్ మార్చి 25, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలనుసారం నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ తనిఖీలలో మైనర్లు వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, ఇన్సూరెన్స్ లేకపోవడం వంటి తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా నల్గొండ టూ టౌన్ ఎస్ఐ సైదులు తీవ్రంగా స్పందిస్తూ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వడం పూర్తిగా చట్ట విరుద్ధం. ఇకపై అలాంటి కేసుల్లో తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కేసులు నమోదు చేయడం నుంచి వెనుకాడము, అని స్పష్టం చేశారు.అలాగే ఆయన హెచ్చరిస్తూ, లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం అనేవి చిన్న తప్పులు కావు ఇవి ప్రాణాలను బలి తీసుకునే ప్రమాదాలకు దారితీస్తాయి. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలి అన్నారు.మైనర్లు వాహనాలు నడిపిన సందర్భాల్లో వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించగా, భవిష్యత్తులో పునరావృతమైతే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించారు.

## నేరాలు-దారుణాలు

## చెర్వుఅన్నారంలో వానర దాడి..

### వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**కట్టంగూర్, మార్చి 25, ప్రభాతవార్త** కట్టంగూర్ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వానర సేనలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఇళ్లపై దండెత్తుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న పట్టింపు లేని నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలపైకి తెస్తుంది. బుధవారం మండలంలో ని చెర్వుఅన్నారం గ్రామంలో కోతుల దాడితో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయ పడింది. కోనేటి ఎల్లమ్మ అనే వృద్ధురాలు తన ఇంటి ఆవరణలో పనులు చేస్తుండగా కోతుల గుంపు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. ఒంటినిండా గాయాలతో రక్తస్రావం కావడంతో ఆమె బట్టలు రక్తంతో తడిసి ముద్దయిపోయాయి. బాధితురాలను చూసిన గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు వెంటనే 108 ద్వారా నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద పెరిగిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గురుకుల పరీక్షలో ప్రతిభ.. 15మంది విద్యార్థుల ఎంపిక

**చిట్యాల రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో నిర్వహించిన వీటీజీ సెట్-2026 పరీక్షలో చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో పాఠశాలకు చెందిన మొత్తం 15 మంది విద్యార్థులు అర్హత సాధించి వివిధ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందినట్లు పాఠశాల



ప్రిన్సిపల్ దోర్నాల శివ తెలిపారు. ఈసందర్భంగా ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి అర్హత సాధించిన విద్యార్థులు కొయగూర శివ, బొడిగె ఉపేక్ష, కంకల శ్రేష్ఠి, జోగు గహణ, మారగోని అక్షర, అరిగెల నిఖిల్, ఉయ్యాల నిహల్, సుక్క అశ్విత, కళ్లెం మోక్షిత్, నమ్ముల నిషిత్, కొయగూర శ్రీలేఖ, బొడిగె సాన్వి, మైల సాహితీ, రాచకొండ మోర్య, పగడాల సాయిచైతన్య లను ఆయన ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ప్రతిభ చాటడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మర్రి రామలింగయ్య, శశిరేఖ, సౌమ్య, శ్రేయ పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్‌కు నూతన కమిటీ ఎన్నిక.

ఆలేరు మార్చి 25,ప్రభాతవార్త :

జూనియర్ సివిల్ జడ్జి జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో నూతన బార్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా, ఏకాభిప్రాయంతో జరిగాయి. అధ్యక్షునిగా కొంతం వెంకటేశ్వర ప్రసాద్, ఉపాధ్యక్షునిగా రావుల రవీందర్ . ప్రధాన కార్యదర్శిగా తోటకూర రాజు, సహకార కార్యదర్శిగా వస్పరి సంపత్ కుమార్, కోశాధికారిగా పారునంది రవికుమార్ . స్పోర్ట్స్ మరియు కల్చరల్ కార్యదర్శిగా సామల రమేష్ . కార్యవర్గ సభ్యులుగా మొరిగాడి కృష్ణ, పూల గురుమూర్తి, లోకేశ్వరి, సంగీత, పల్వార్, అనీఫా, మొబైన్ సభ్యులుగా తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ. నా ఎన్నికకు సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీపీలు భీమ గాని హరిబాబు, దప్పు వీరస్వామి, సీనియర్ న్యాయవాదులు జూకంటి రవీందర్, సీసా శ్రీనివాస్, వనం రాజు, భీమ గాని శ్రీనివాస్, వంగరి శివకుమార్, తుంగ హరికృష్ణ, కల్లూరి సిద్ధులు, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు

## విశ్రాంత ఉద్యోగుల నిరసన

నడిగూడెం, మార్చి 25, ప్రభాతవార్త

:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నడిగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్ల హక్కులకు తీవ్రమైన విఘాతం కలిగించే వ్యాలిడేషన్ యాక్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నడిగూడెం తహసిల్దార్ బి. రామకృష్ణారెడ్డి కి మెమోరాండం అందజేశారు .ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు యం డి. ఖలీల్ అహ్మద్ వాల్యుయేషన్ యాక్ట్ ఏ విధంగా పెన్షనర్లను ఆందోళనకు గురిచేస్తుందో వివరించారు.తమ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడపడానికి పెన్షన్ ప్రధాన ఆధారం అన్నారు. అయితే ఇటీవలి పరిణామాలు దేశవ్యాప్తంగా పెన్షనర్లలో ఆందోళన కలిగిస్తున్నాయని, ముఖ్యంగా వాలిడేషన్ చట్టం ప్రవేశపెట్టడం, పెన్షన్ ప్రయోజనాలపై పరిమితులు విధించే ప్రయత్నాలు, పెన్షనర్ల మధ్య వర్గీకరణ వంటి అంశాలు పెన్షనర్లలో ఆందోళనకు కారణం అవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో పెన్షనర్ల హక్కులను కాపాడుకోవడం అత్యవసరం అని ఆయన తెలిపారు.అఖిల భారత పెన్షనర్ల సమాఖ్య పిలుపు మేరకు మార్చి 25న 'బ్లాక్ డే'గా పాటించామని,ఈ నిరసన కార్యక్రమం దేశమంతటా పెన్షనర్ల ఐక్యతకు ప్రతీక



గా పేర్కొంటూ నడిగూడెం మండల పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి, తాసిల్దార్ కు వినతిపత్రాలు అందజేస్తూ, భారత ప్రధానమంత్రికి తమ ఆవేదనను పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో తెలియజేయడం జరిగిందన్నారు.పెండింగ్‌లో ఉన్న పెన్షనరీ ప్రయోజనాలను విడుదల చేసి, వేతన సవరణ అమలు చేయాలి అన్నారు. కరువు భత్యం బకాయిలను చెల్లించాలనీ ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండలం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి యల్ బాలాజీ, ఆర్థిక కార్యదర్శి యండి. ఇబ్రహీం, మండల కార్యవర్గ సభ్యులు అలుగువల్లి అప్పారెడ్డి, దున్న అంజయ్య, వేపూరి రాములు, తూము వెంకటేశ్వరరావు, పి విజయమ్మ, సీనియర్ పెన్షనర్లు యండి.జానిమియా, యం. వీరయ్య, జి రామయ్య, డి. వీరయ్య,జి సర్వమ్మ, డి పద్మ, డి మేరమ్మ, పి మంగమ్మ,జి జయమ్మ, జి ముత్యాలమ్మ, పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో అన్నదానం



మునగాల, మార్చి 25, ప్రభాతవార్త :

మునగాల మండల కేంద్రానికి చెందిన బచ్చలకూర రాజీవ్ వీరమణి ల మొదటి కుమార్తె బచ్చలకూరి కనిష్క మొదటి పుట్టినరోజు సందర్భంగా బుధవారం కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ మానసిక అనాథ ఆశ్రమంలో అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కనిష్క తన తల్లిదండ్రులతో కలిసి కేక్ కట్ చేసి అనాథాశ్రమంలోని మానసిక వికలాంగులుగా ఉన్న అనాధలకు స్వీట్లు కేకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేడుకల్ని మానసిక వికలాంగులుగా ఉన్న అనాధాశ్రమంలోని అనాధల మధ్య జరుపుకోవడం తమకు ఆనందంగా ఉందని అన్నారు. సమాజానికి దూరంగా కుటుంబ బాధ్యతలు బంధుత్వాలు తెలియని అనాధలకు అన్నదానం ద్వారా తాము వారికి ఒక పూట కడుపు నింపడం తమకు ఎంతగానో మానసిక సంతృప్తిని అందించిందని తెలిపారు.

## గ్రామ ప్రజలు ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మునగాల, మార్చి 25, ప్రభాతవార్త

:గ్రామ ప్రజలు ఉచిత వైద్య సేవ సద్వినియోగం చేసుకోవాలని కుంచం ఇందిరా నరసయ్య అన్నారు.మండల పరిధిలోని నర్సింహులు గూడెం గ్రామం లో సర్పంచ్ కుంచం ఇందిర నరసయ్య సహకారంతో బుధవారం వినూత్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే మెగా వైద్య శిబిరాలు అన్నారు.గ్రామం లో సుమారు ఐదు వందల మంది ప్రజలు ఆరోగ్య సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ గుండె వైద్యులు డా.వరప్రసాద్ న్యూరో పిజిషియన్ డా.రిజ్వాన్ గ్యాస్ట్రో వైద్యులు డా.ఉదయ్ దీంతో వైద్యులు డా.ప్రవళిక మేనేజ్మెంట్ నల్లగట్టు నగేష్,ఉప సర్పంచ్ సీతారాములు, మాజీ ఎంపిటిసి విజయలక్ష్మి ,మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలి



నడిగూడెం, మార్చి 25, ప్రభాతవార్త

:ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో, చుట్టుపక్కల గ్రామాల్లో బుధవారం అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సి న చర్యల గురించి ప్రజలకు ఎస్సై అజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. డిఫెన్స్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ పట్టా దారులపై క్రిమినల్ కేసులు నమోదు

అనంతగిరి ప్రభాత వార్త

:ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదైయ్యాయి.వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామానికి చెందిన బుర్ర మట్టమ్మ భర్త చిన్న లింగయ్య వాయిలసింగారం రెవెన్యూ గ్రామ శివారులోని గల సర్వే నెం.8/3/1 లో విస్తీర్ణం ఏ.434 గుంటల ప్రభుత్వ భూమినీ 2013/14 సంలో అక్రమంగా పట్టా పొందారు.అనంతరం అట్టి భూమిని వారి వారసులైన బుర్రా సైదులు తండ్రి వెంకటేశ్వర్లు,బుర్ర లింగరాజు తండ్రి వెంకటేశ్వర్లు,బుర్ర వెంకటేశ్వర్లు తండ్రి చిన్న లింగయ్య పేర్ల మీదుగా సౌతి ద్వారా 10/07/2025న పట్టా మార్పిడి చేసుకున్నారు.ఇట్టి విషయంపై నమ్మదగిన సమాచారం మేరకు విచారణ చేపట్టగా 2013/14 సంలో బుర్రా మట్టమ్మ భర్త చిన్న లింగయ్య పేరున అక్రమంగా పట్టా నమోదు చేసినట్లు తెలిలందని, అట్టి విషయాన్ని తెలిసి కూడా దురుద్దేశముతో సంబందిత అధికారులకు తెలుపకుండా పట్టామార్పిడి చేసుకున్నారు.అప్పటి గ్రామ రెవెన్యూ అధికారితో కుమ్మక్కై వున్నటువంటి విస్తీర్ణముకంటే ఎక్కువగా నమోదు చేపించుకొన్నారు.ప్రభుత్వాన్ని మోసం చేసి రైతుబంధు,రైతుబరోసా లబ్ది పొందుతున్నారు.ఈ మేరకు పట్టామార్పిడి చేపించుకొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

## సమస్యల పరిష్కారానికి కృషి

నడిగూడెం, మార్చి 25, ప్రభాతవార్త



:మండలంలోని చెన్నకేశవపురం గ్రామ పంచాయతీలో గ్రామసభ బుధవారం సర్పంచ్ గోసుల రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో యువకులు భాగస్వామ్యం కావాలని కోరారు. చేపట్టాల్సి న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఏ వార్డులో ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. ఒక్కటొక్కటిగా పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటుకున్న విద్యార్థులు

నడిగూడెం, మార్చి 25, ప్రభాతవార్త



:ఐదవ తరగతిలో ప్రవేశానికి గురుకుల సెట్ పరీక్ష ఫలితాల్లో నడిగూడెం శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి పలు పాఠశాలల్లో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బుస్సా సులోచన తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీర కుమారి, మల్లిక, సాజిదా ,సప్న, నాగమణి పాల్గొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మహేష్ ఉపాధ్యాయులు సైదులు, రాంబాబు అభినందించారు. అదేవిధంగా రామాపురం ఎంపీపీ ఎస్ పాఠశాల విద్యార్థులు గీతిక, మణి ప్రియ, అనూష, జస్వంత్ కూడా ఐదవ తరగతిలో ప్రవేశానికి సీట్లు సాధించారు. విద్యార్థులను ఉపాధ్యా యులు సాయి, నాగేశ్వరరావు అభినందించారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక

నడిగూడెం, మార్చి 25, ప్రభాతవార్త

:మండలంలోని వల్లాపురం గ్రామంలో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి విద్యుత్తు సమస్యలు ఏమైనా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. అవసరమున్న చోట కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. దెబ్బతిన్న ట్రాన్స్ఫార్మర్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేశగాని సరిత, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.



## పెన్షనర్లకు పాలిట శాపంగా వ్యాలిడిషన్ చట్టం.



కోదాడ, మార్చి 25, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యాలిడిషన్ చట్టం2025 దేశంలోని లక్షలాది మంది పెన్షనర్ల జీవితాల్లో అంధకారం నింపుతుందని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా పెన్షనర్ల సంఘం పిలుపుమేరకు బుధవారం కోదాడలో ఈ చట్టానికి వ్యతిరేకంగా కోదాడ సంఘ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా తరలి వెళ్లి ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు.జనవరి 1, 2026 కంటే ముందు పదవీ విరమణ చేసిన వారికి డీఏ,పీఆర్సీ ప్రయోజనాలు ఉండవని చెప్పడం పెన్షనర్ల ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో సూర్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మునబోయిన వీరబాబు,అసోసియేట్ అధ్యక్షులు వి జానయ్య, ఉపాధ్యక్షులు గులాం ఎస్ దాని, భ్రమరాంబ, సంయుక్త కార్యదర్శి భూపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్ శంబయ్య, ఈసీ మెంబర్ బాలేమియా, మణిరం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్టు సవరణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**పెద్దవూర మార్చి 25 ప్రభాతవార్త**

ఓటర్ లిస్టు సవరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాసిల్దార్ శ్రీదేవి అన్నారు బుధవారం మండల కేంద్రంలో ఎస్ ఐ ఆర్ పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిఎల్వోల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో ఓటర్ లిస్టు సవరణపై ప్రత్యేక శ్రద్ధ వహించి తప్పులు లేకుండా 100!! కచ్చితత్వంతో కూడిన ఓటర్ లిస్టు తయారు చేయవలసిందిగా బిఎల్ఓ లను కోరారు ఇప్పటివరకు మనదేశంలో ఎనిమిది సార్లు ఎస్ ఐ ఆర్ చేయడం జరిగింది. చివరగా 2004లో ఎస్ఐఆర్ చేయడం జరిగింది. మళ్లీ ఇప్పుడు మన రాష్ట్రంలో నిర్వహించడం జరుగుతుంది . ఈ ఎస్ ఐ ఆర్ లో 2004లో ఉన్న ఓటర్ లిస్టును ప్రస్తుతం ఉన్న ఓటర్ లిస్టు తో అనుసంధానం చేస్తూ మ్యాచింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. 2004 తర్వాత జన్మించిన వారికి ఓటర్ లిస్ట్ కు సంబంధించి జనన ధ్రువ పత్రంతోపాటు తల్లి, తండ్రి ల జనన ధ్రువ పత్రం, నివాస స్థానిక ధ్రువ



పత్రం సమర్పించాల్సి ఉందని తెలిపారు. కావున ప్రతి బిఎల్ఓ ప్రతి ఓటర్ కు సంబంధించి ఎన్యూ మరేషన్ ఫామ్స్ ను నింపి సకాలంలో సూపర్వైజర్లకు తద్వారా ఏ ఈ ఆర్ ఓ లకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ దండ శ్రీనివాస్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్, ఇరుమాది పాపిరెడ్డి, మేదరి దేవేందర్, సూపర్వైజర్లు బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు




## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలి

**తుంగతుర్తి . మార్చ్ 25. ప్రభాతవార్త**

రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సర్పంచ్ మల్లెపాక సాయిబాబా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జాతీయ పశు వ్యాధుల ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం కోసం మన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వల సహాయంతో ప్రతి సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు రైతులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. అలాగే టీకా వేయని పశువులు వ్యాధి బారిన పడే అవకాశం కలదని వ్యాధి వస్తే పశువులు జ్వరంతో నిరసించి నోరు గిట్టల మధ్య బొబ్బులు ఏర్పడి అవి 24 గంటల్లో చితికిపోయి పుండ్లుగా మారి మేతమేయ్యక నిరసించి చనిపోయే అవకాశం కలదని అన్నారు. పాలిచ్చే పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందని వ్యాధి సోకిన ఆవుల గేదెల దూడలు పాలు తాగిన చనిపోయే అవకాశం



కలదని అన్నారు. వ్యవసాయ ఎద్దులు పనిచేయలేవు కనుక ప్రతి పశువుకు టీకాలు తప్పనిసరి అని తెలిపారు గ్రామంలో ఈరోజు 125 పశువులకు టీకాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సంచాలకులు డాక్టర్ బి రవి ప్రసాద్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్ సిబ్బంది రాజశేఖర్ , రవి గోపాలమిత్రులు లింగయ్య ,శ్రీను, గణేష్, రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా చామలేడు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**గుర్రంపోడు,మార్చి 25, ప్రభాతవార్త**

:తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల ఐదో తరగతి ప్రవేశ పరీక్షల్లో నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం చామలేడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలకు పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు హాజరుకాగా, అందులో సిలువేరు విగ్నేష్, పగడాల రోహిత్ ప్రవేశానికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మారం జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా బోధన సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పట్టుదలతో శ్రమించి గురుకుల సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు ఎం. పద్మ, వి. లక్ష్మి ్ర పాల్గొని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని వారు తెలిపారు. తమ పాఠశాల పేరును నిలబెట్టిన విద్యార్థులను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు .

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి




**పెద్దవూర, మార్చి 25 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 20వ తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్ ను సవరించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ..సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నపాక లక్ష్మీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పెద్దవూర మండల కమిటీ సమావేశం దోరెపల్లి మల్లయ్య అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో మూడు లక్షల 24 వేల 234 కోట్ల కోట్లతో ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా లేదని అంకెల గారడీగా ఉందని దీన్ని వెంటనే సవరించి, ప్రజా సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా వైద్యరంగం మరింత పేదలకు చేరువ కావాలంటే బడ్జెట్ లో నిధులు పెంచాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం మాత్రం అరకొర నిధులు మాత్రమే కేటాయించిందని అన్నారు. వ్యవసాయ రంగానికి, రైతాంగ సంక్షేమానికి కూడా ఇప్పుడు పెట్టిన బడ్జెట్ నిధులు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ పెండింగ్ ప్రాజెక్టులు, ఎరువులు విత్తనాలు అప్పుల ఊబిలో ఉన్న రైతన్న బయట పడేయడం కోసం ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ,పెన్షన్లు ఇతర సంక్షేమ పథకాలు అమలుకు కూడా అరకొర నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కోటి 30 లక్షల మంది కార్మిక వర్గం ఉన్నారని వారి సంక్షేమానికి కనీసం 1000 కోట్లు కూడా కేటాయించలేదని అన్నారు. కొత్త ప్రాజెక్టుల పేరుతో సంక్షేమ పథకాలకు కోత పెడితే రాష్ట్ర ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్ ను సవరించి ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి దేంగా ఉండే విధంగా రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య,, మండల కమిటీ సభ్యులు ఎస్.కె బషీర్, గజ్జల కృష్ణారెడ్డి, తరి రామకృష్ణ, మగ్దూం మోహినిద్దన్ తదితరులు పాల్గొన్నారు

## అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి

**హాలియా, ప్రభాతవార్త, మార్చి 25:**



హాలియా మున్సిపాలిటీ అంగడి బజార్లో రహదారులను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని హాలియా మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలోని అంగడి బజార్ ను సందర్శించి అక్రమ నిర్మాణం తొలగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులు తమ వ్యాపారాన్ని తప్పనిసరిగా తమ షాపు పరిధిలోని నిర్వహించుకోవాలని రోడ్లపై, ఫుట్పాతులపై వస్తువులు ఉంచి వ్యాపారం చేయకూడదన్నారు. ఈ సూచనలు పాటించని పక్షంలో మున్సిపాలిటీ చట్టాల ప్రకారం ప్రత్యేక టీములతో అక్రమాలలో తొలగించి తద్వారా కలిగే నష్టం, ఖర్చులు సంబంధిత వ్యక్తుల నుండి వసూలు చేస్తామన్నారు. ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ సజావుగా నడవడం, పట్టణ శుభ్రత దృష్ట్యా అందరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రామాలయ నిర్మాణానికి బుసిరెడ్డి విరాళం



**హాలియా, ప్రభాతవార్త, మార్చి 25:**

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుములవారి గూడెంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి 50 వేల రూపాయలను ప్రకటించారు. బుధవారం ఆలయ నిర్మాణ నిర్వాహకులు హైదరాబాదులో బుసిరెడ్డి పాండురంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ నిర్మాణానికి తోడ్పడాలని కోరడంతో పాండురంగారెడ్డి తన తరపున వెంటనే 50వేల రూపాయలను ప్రకటించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ డైరెక్టర్ గొర్ల ఈదయ్య, మారం శ్రీనివాస్ రెడ్డి, సండ్ర వెంకటయ్య, రావుల లింగ యాదవ్, రావుల సాలయ్యయాదవ్, రావుల వెంకటేశ్వర్లు యాదవ్, అనుముల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ పారిశుద్ధ్యంలో ప్రజలు పాలుపంచుకోవాలి

**హాలియా, ప్రభాతవార్త, మార్చి 25:**

పట్టణ పారిశుద్ధ్యంలో ప్రజలు కూడా పాలుపంచుకొని హాలియా మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హాలియా మున్సిపాలిటీలోని ప్రధాన రహదారుల వెంబడి



షాపులోకి వెళ్లడానికి మట్టి పోసి ర్యాంపు ఏర్పాటు చేసుకున్నారు. అట్టి మట్టి పేరుకుపోయి ప్రయాణికులకు చాలా ఇబ్బంది కలుగుతుండడంతో మున్సిపాలిటీ సిబ్బందితో మట్టిని తొలగించి రహదారిని శుభ్రం చేయించారు. ఇకపై నైనా షాపుల్లో ముందు కాంక్రీట్ తో రాంపుల్ పోయించుకోవాలని షాప్ యజమానులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుడిపై రాజకీయ బుడద చల్లకుండా ఐక్యత చాటాలి..

### శివరామ ఆలయ కమిటీ పదవులకు రాజీనామా .. మిగులు ఆదాయం బ్యాంకులో జమ చేసిన చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి



**మునుగోడు మార్చి 25 ప్రభాతవార్త** గుడిపై ఎలాంటి రాజకీయ బురద చల్లకుండా ఐక్యత చాటాలని శివరామ ఆలయ కమిటీ చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివరామ ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 నుంచి నేటి వరకు ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలకు వచ్చిన ఆదాయ వేయాల లెక్కలను కమిటీ ఆధ్వర్యంలో తెలియజేశారు. ఖర్చులు పోగా మిగులు ఆదాయం 57వేల208 రూపాయలను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు లో జమ చేసినట్లుగా తెలిపారు. కులాలకు అతీతంగా ఆలయంలో జరుగు ప్రతి కార్యక్రమానికి గ్రామస్తులు క్రమశిక్షణతో ముందుకు రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. శివరామ ఆలయానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిన దాతలకు గ్రామస్తులకు అర్చకులకు భక్తులకు ప్రజా ప్రతినిధులకు కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. తదనంతరం శివరామ ఆలయ కమిటీ పదవులకు రాజీనామా చేసి పత్రాన్ని గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి యాదగిరి రెడ్డి, ఎడవెల్లి సురేష్, పెరమాండ్ల ప్రమోద్, కంచర్ల వెంకన్న, మునుగోటి యాదయ్య, సింగం గిరి, రేబేల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ప్యాకేజ్ కింద 500 కోట్లు కేటాయించాలి

### ..మునుగోడును కరువు ప్రాంతంగా ప్రకటించాలి ..గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ అధ్యక్షులు రాఘవేంద్ర యాదవ్ డిమాండ్



**మునుగోడు మార్చి 25 ప్రభాతవార్త** జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో ప్రజా ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గానికి స్పెషల్ ప్యాకేజీ కింద 500 కోట్లు రూపాయలను కేటాయించాలని గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ వ్యవస్థాపక అధ్యక్షులు నెల్లికంటి రాఘవేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఒక ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ మునుగోడు ను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని అన్నారు. మునుగోడు ప్రాంతమంతా వర్షాధారంగా ఆధారపడి రైతులు వ్యవసాయం సాగిస్తున్నారని సాగు త్రాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని కూత వేటు దూరంలోనే బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ ఉన్న మునుగోడు కు ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మునుగోడేనని ప్రభుత్వాలు మారిన ప్రజల తలరాతలు మారే పరిస్థితి కనిపిస్త లేదన్నారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక మునుగోడు ప్రాంతం తల్లడిల్లి పోతుందని అన్నారు. అసలే ఫ్లోరైడ్ ప్రాంతం అందులోనూ భూగర్భ జలాలు నీటిమట్టం తగ్గి చేతికందే దశలోనే వరి పంట పొలాలు ఎండిపోయి రైతంగం దిక్కు తోచని పరిస్థితిలో ఉందన్నారు. రైతు పక్షపాతి అని చెప్పుకుంటున్న ప్రజా పాలన ప్రభుత్వం తక్షణమే ఈ ప్రాంతానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి 7ఆర్ కాలువలను త్రవ్వించి తాగు సాగునీరుతో వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేయాలని అందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

# వేలంలో 3.80 కోట్లు పైచిలుకు పలికిన కొండమల్లేపల్లి పశువుల సంత

### పశువుల సంతను వేలంలో దక్కించుకున్న కల్వకుర్తివాసి వర్కాల భాస్కరెడ్డి



**కొండమల్లేపల్లి,మార్చి25,ప్రభాతవార్త:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పశువుల సంత వేలంపాట బుధవారం అత్యంత హోరాహోరీగా కొనసాగింది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం పశువుల సంత వేలంపాట రికార్డు స్థాయికి చేరుకుంది. సంతను దక్కించుకోవడం కోసం 25 మంది అభ్యర్థులు 10లక్షల రూపాయలను డిడి రూపంలో గ్రామ పంచాయతీకి ముందుగానే చెల్లించి ఈ వేలం పాటలు పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర (ఆఫ్ సెట్ ప్రైస్) 1,26,60,043 రూపాయలుగా డిపిఓ శంకర్ నాయక్ తెలిపారు. మొదట జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సంత వేలంపాటకు సంబంధించిన నియమ నిబంధనలను అభ్యర్థులకు వివరించారు. అనంతరం డిపిఓ ఈ వేలం ప్రక్రియను ప్రారంభించారు. వేలంలో మొదటి నుండి కూడా ఉత్సాహంగా, పోటాపోటీగా అభ్యర్థులు పాల్గొన్నారు. గత సంత వేలంపాటతో పోల్చితే ఈసారి వేలంపాట దాదాపుగా మూడు రెట్లు అధికంగా దాటిపోయింది. చివరగా కల్వకుర్తికి చెందిన వర్కాల భాస్కర్‌రెడ్డి దక్కించుకున్నారు. అనంతరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గత మూడు పర్యాయాలుగా సంతను దక్కించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ కొన్ని అనివార్య కారణాలవల్ల అది కుదరలేదని అన్నారు. నాలుగో ప్రయత్నంలో సఫలం కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రైతులకు, పశువులకు సంతలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇంత భారీ మొత్తంలో పశువుల సంత ధర పలకడంతో స్థానికులు, రైతులు విస్మయానికి గురవుతున్నారు. భారీ మొత్తంలో గ్రామ పంచాయతీకి ఆదాయం రావడం పై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ డిపివో శంకర్‌నాయక్, తహసీల్దార్ నరేందర్, ఇన్చార్జ్ ఎంపిడివో సుధీర్ కుమార్, పంచాయతీ సెక్రటరీ డాకునాయక్, సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పద్మ వెంకటయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా లపంగి నరసింహ ఏకగ్రీవ ఎన్నిక

**మర్రిగూడ,మార్చి25,ప్రభాతవార్త:** తెలంగాణ సర్పంచుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ లపంగి నర్సింహ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ప్రముఖ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూసర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి నరసింహ కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు లపంగి నర్సింహ రవికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులను ఏకం చేసి, వారి హక్కులకోసం పోరాడుతానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల రాంరెడ్డిపల్లి గ్రామస్థులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, మర్రిగూడ మండల ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



# మర్రిగూడ బంకుల వద్ద వాహన దారుల సందడి

మర్రిగూడ, మార్చి25, ప్రభాతవార్త :



పెట్రోలు డీజిల్ ఇంధన కొరత రాబోతుందన్న ప్రచారంతో మర్రిగూడలోని బంకుల వద్ద వాహనదారులు పోటెత్తారు. ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ మధ్య యుద్ధ ప్రభావంవల్ల పెట్రోల్ కొరత ఏర్పడుతుందని సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి జనం పెట్రోల్, డీజిల్‌కోసం బంకులవద్ద కిక్కిరిశారు. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వాహనాలు బారులుతీరి ఎగబడ్డారు. సంబంధిత అధికారులు ప్రజల్లో ఉన్న ఆందోళనను తొలగించేందుకు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.




# పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025ను వెంటనే ఉపసంహరించుకోవాలి

### విశ్రాంత ఉద్యోగులసంఘం మండల అధ్యక్షుడు గోన సత్యానారాయణరావు

**చండూరు,మార్చి25,ప్రభాతవార్త:** పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025ను



వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ మండల తహసిల్దార్ రమాకాంత్ శర్మకు బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గోన సత్యనారాయణరావు మాట్లాడుతూ పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025 వలన రాబోయే పి ఆర్‌సి బెనిఫిట్స్ జనవరి 1,20-26 కంటే ముందు రిటైర్ అయిన వారికి ఉండవని అన్నారు. చట్టం తీసుకొచ్చిన దృశ్య, ఇలాంటి వివక్షత లను పెంచి భవిష్యత్తులో అసలుకు ఎసరుపెట్టే అవకాశం ఉన్నందున, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్స్ ఆధ్వర్యంలో మార్చి 25 న దేవరకొండ ఆర్డిఓ, తహసిల్దార్ కార్యాలయంవద్ద తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నందున పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు గోన సత్యనారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గాలెంక జీవరత్నం, రాజలింగం, మహబూబ్, పోలా జగతయ్య తదితరులు పాల్గొన్నారు.

# చండూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి...

### ....నల్ల మధు యాదవ్.

**చండూరు,మార్చి25,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను చండూరుకు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు నల్ల మధుయాదవ్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో మోడల్ పాఠశాలలు ఉన్నాయని, కానీ చండూరుకి మంజూరు అయిన మోడల్ పాఠశాల ఏ కారణం వల్లనో రాజగోపాల్‌రెడ్డి పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సమయంలో ఏర్పాటు కాలేక పోయిందని, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నందున తెలంగాణ పబ్లిక్ స్కూల్ చండూరు లో ఏర్పాటు చేయటానికి కృషి చేయాలనీ కోరారు. చండూరు పేరుకు మాత్రమే రెవెన్యూ డివిజన్ అయింది కానీ విద్య వైద్యంలో చాలా వెనకబడి ఉందన్నారు. స్థానిక నాయకుల నిర్లక్ష్యం కారణంగానే చండూర్‌లో మోడల్ స్కూల్, మోడల్ కాలేజ్ నేటికీ ఏర్పాటు కాలేదన్నారు. మునుగోడులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభ దశలో ఉండడం, చౌటుప్పల్లో మోడల్ స్కూల్, కాలేజ్, నాంపల్లి, మర్రిగూడలో నారాయణపురంలో అన్ని మండలాల్లో కూడా మోడల్ స్కూల్స్ మోడల్ కాలేజీ ఉన్నాయి కానీ చండూరులో ఎందుకు మోడల్ స్కూల్‌కానీ, మోడల్ కాలేజ్ గాని ఎందుకు ఏర్పాటు కావటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా తక్షణమే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని లేకపోతే బీసీ విద్యార్థి సంఘాల పక్షాన రాజగోపాల్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌ను వేలాది విద్యార్థులతోటి ముట్టడిస్తామని బీసీ విద్యార్థి పక్షాన డిమాండ్ చేయడం జరుగుతున్నదన్నారు.



## చలకాని వెంకట్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలియజేసిన నమాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్ యాదవ్

కేతపల్లి ప్రభాతవార్త మార్చి 25



హైకోర్టు బార్ అసోసియేషన్ కౌన్సిల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన హైకోర్టు అడ్వకేట్ చలకాని వెంకట్ యాదవ్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ మీరు మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంతో మందికి దారి చూపాలని ఆకాంక్షిస్తూ తెలియ చేసిన కేతుపల్లి మండల మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస యాదవ్ భీమారం గ్రామ సర్పంచ్ చి సి చీముట పద్మా యాదవ్ గుడిపూడి వెంకటయ్య సిహెచ్ భగత్ నిమ్మది సైదులు

## ఎల్లమ్మ గుడి వద్ద కుమ్మర్లకు హక్కులు పునరుద్ధరించాలి

: తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వినతి



**నార్కట్పల్లి ప్రభాతవార్త మార్చి 25** నార్కట్పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సుమారు 40 కుటుంబాల కుమ్మర్లు చెరువుగట్టు శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని ఎల్లమ్మ తల్లి గుడి వద్ద బోనాలు సమర్పించడం, పూజా కార్యక్రమాలు నిర్వహించడం వంటి సంప్రదాయాలను అనేక సంవత్సరాల నుండి కొనసాగిస్తూ వచ్చారు. అయితే ఇటీవల నియమితులైన ఈవో మోహన్ బాబు కుమ్మర్లు ఎల్లమ్మ గుడి వద్దకు రావద్దని ఆదేశించడం వివాదానికి దారి తీసింది.ఈ అంశంపై తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ( టి ఆర్ కె ఎస్ ) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు ఈవోను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు. గతంలో ఉన్న హక్కులను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, కుమ్మర్లకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సంఘ ప్రతినిధుల విజ్ఞప్తికి స్పందించిన ఈవో మోహన్ బాబు సమస్యను సానుకూలంగా పరిశీలించి, కుమ్మర్లకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రాధారపు బిక్షపతి, నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి నిమ్మనగోటి వెంకన్న, నార్కట్పల్లి మండల శాఖ అధ్యక్షుడు మిడిదొడ్డి రాజు, ఎల్లారెడ్డిగూడెం గ్రామ శాఖ నాయకులు బొడ్డుపల్లి హుస్సేన్, బొడ్డుపల్లి సత్తయ్య, బొడ్డుపల్లి శంకర్, బొడ్డుపల్లి వెంకటేష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

కట్టంగూర్ యస్.ఐ. మునుగోటి రవీందర్



**కట్టంగూర్, మార్చి 25, ప్రభాతవార్త,** కట్టంగూరు మండల కేంద్రంలోని కల్మేర రోడ్డులో ఆవరణలో బుధవారం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ మునుగోటి రవీందర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా ప్రాణ రక్షణ సడక్ సురక్ష జీవన్ రక్ష కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ మాట్లాడుతూ ప్రజలు జీబ్రా క్రాసింగ్ ఉన్నవొద్దనే రోడ్డు దాటాలని, అతివేగం ప్రమాదకరమని, నిదానమే ప్రధానమని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్న తదితరు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్, ద్విచక్ర వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఫలితాలలో మల్లారం విద్యార్థుల ప్రతిభ

**కట్టంగూర్,మార్చి 25, ప్రభాతవార్త,** ఇటీవల నిర్వహించిన గురుకుల పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలైన 5వ తరగతి తెలంగాణ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాలలో మల్లారం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు దండెంపల్లి లక్ష్మీప్రసన్న, దాసరి జస్మిక సీట్లు సాధించారు. ఈ పాఠశాల నుంచి కేవలం ఇద్దరు మాత్రమే ప్రవేశ పరీక్ష



రాయగా ఇద్దరు కూడా సీటు సాధించడం ఎంతో గర్వంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు దండంపెల్లి రాజేష్ మోనిక, దాసరి సైదులు స్వప్న ఆనందం వ్యక్తం చేశారు. జూన్ 2024లో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్న ఈ పాఠశాలను ఈరోజు 36 మందికి పెంచి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఐదు క్లాసు రూమ్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఇద్దరికీ ఒక డెస్క్ బెంచ్ ఏర్పాటు చేశామని, ప్రతి బుధవారం చికెన్, చేపతో రుచికరమైన అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు సమ్మెటి తిరుమలేష్ గౌడ్, షరీఫుద్దీన్ లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులను గ్రామ సర్పంచ్ పెద్ది నాగమణి మల్లేష్ గౌడ్ అభినందించారు.

## పాఠశాలకు కుర్చీల అందజేత

కట్టంగూర్, మార్చి 25, ప్రభాతవార్త,



మండలంలోని పెరిందేవిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాలలో కుర్చీలు అవసరం ఉన్నాయని తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, సామాజికవేత్త ఉబ్బని రాజు బుధవారం తన సొంత డబ్బులను ఇచ్చి కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఉబ్బని రాజు మాట్లాడుతూ ఇంకా భవిష్యత్తు లో స్కూల్ కి, విద్యార్థిని విద్యార్థులకు కావలసిన సామాగ్రిని సమకూర్చు తానని, స్కూల్లో ఉన్న సమస్యల గురించి ఉన్నతాధికారులకు తెలియజేస్తూ స్కూల్ యొక్క బాగోగులు చూసుకుంటాని హామీ ఇచ్చారు. తాను విద్యాభ్యాసం చేసిన పాఠశాలకు చైర్లను అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

## గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలు ఎంపీడీఓ, జ్ఞాన ప్రకాష్ రావు, సర్పంచ్ శ్యామలశేఖర్

కట్టంగూర్, మార్చి 25, ప్రభాతవార్త,

గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలని ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం కట్టంగూరు శాఖ గ్రంథాలయంలో పుస్తక పఠనం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనం మనిషి ఆలోచన విధానాన్ని మార్చి, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని వారు తెలిపారు. యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని, రోజువారీగా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. సమాజ అభివృద్ధికి చదువు ఎంతో అవసరమని, అందుకోసం ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సభ్యత్వం పొందాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, ఉపసర్పంచి గుండు రాంబాబు గౌడ్, పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ గౌడ్, వార్డు సభ్యులు ఏనుగు సైదులు, కానుగు శీను, పులకరం శీను, ముశం లావణ్య ఉమేష్, గ్రంథ పాలకురాలు తారకేశ్వరి తదితరులు ఉన్నారు.






## శ్రీరామనవమి వేడుకల కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేముల

వీరేశం చిట్యాల, మార్చి 25, ప్రభాతవార్త



శ్రీరామనవమి సందర్భంగా స్థానిక శివాలయంలో నిర్వహించి సీతారాముల కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. ఆహ్వాన పత్రిక ను దేవాలయ చైర్మన్ రంగా వెంకన్న ఎమ్మెల్యేకు అందజేసి ఆహ్వానించారు. దేవాలయ పూజారి దౌలతాబాద్ వాసుదేవ శర్మ, కనకదుర్గ దేవాలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్, వనమా వెంకటేశ్వర్లు, పందిరి శ్రీనివాసులు, జడల ఆది మల్లయ్య యాదవ్, పందిరి రమేష్, పాటి మాధవరెడ్డి, బూరుగు కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## 2025లో పార్లమెంటులో ప్రవేశపెట్టి పాస్ చేసిన బిల్లును ఉపసంహరించుకోవాలి

**కందాల పాపిరెడ్డి జిల్లా అధ్యక్షులు**



**నకిరేకల్ ప్రభాతవార్త మార్చి 25** బుధవారం రోజున గతంలో కేంద్ర ప్రభుత్వం 2025 లో ప్రవేశపెట్టిన పెన్షనర్లు నష్ట పోయే విదంగా బిల్లును పార్లమెంట్లో ప్రవేశ పెట్టి పాస్ చేసిన దానిని ఉపసంహారించుకోవాలని స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నకిరేకల్ శాఖ ఆధ్వర్యంలో నకిరేకల్ మండల తాసిల్దార్ ద్వారా జిల్లా కలెక్టర్ కి వారి ద్వారా ప్రధానమంత్రి కి చేరువేయాలని సుమారు 37 మంది పెన్షన్ బాధితులు పాల్గొని మండల తహసీల్దార్ కి అందజేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కందాల పాపిరెడ్డి కోశాధికారి చిక్కు రవీందర్ జిల్లా కార్యదర్శి కందుల సోమయ్య అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రయ్య ఉపాధ్యక్షులు పోతుల వెంకటనారాయణ ఉత్తరమ్మ సహాయ కార్యదర్శి బిక్షం రెడ్డి పి అంజయ్య వంటల రామలింగం ప్రచార కార్యదర్శి శివకోటితోపాటు కౌన్సిల్ సభ్యులు కే రామ్ రెడ్డి రామచక్కం సంఘం ప్రతినిధులు రామ్ రెడ్డి రామలింగం సభ్యులు పాల్గొన్నారు

## జాతీయ నాయకులను కలిసిన మండల నాయకులు

నార్కట్పల్లి ప్రభాతవార్త మార్చి 25

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరియు జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను జిల్లా మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా రాజకీయాలపై భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. వారిని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ మాజీ కార్యదర్శి లింగాల యాదయ్య, మండల అధ్యక్షుడు బందారపు శివరాం ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి చింతరాజు, భువనగిరి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చింత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

**పెద్ద అడిశర్లపల్లి, 25 మార్చి ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పిఏపల్లి మండంలోని ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుదవారం నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ యుగంధర్ లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఈ వైద్య శిబిరాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు శిబిరాలకు హాజరయ్యేలా



చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రక్తపరీక్షలు, కీళ్ల సమస్యలకు సంబంధించిన పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు వంటి ఆరోగ్య పరీక్షలను ప్రజలు చేయించుకొని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, ఆప్తమాలజీ వంటి ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరాలకు వచ్చే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అక్షిత, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, పాల్గొన్నారు,

# బీసీలపై దాడులు అరికట్టాలంటే ప్రత్యేక చట్టమే మార్గం.

### బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి : శ్రీనివాస్ గౌడ్.



**దేవరకొండ, మార్చి 25,ప్రభాత వార్త :** ఎస్సీ,ఎస్టీలకు అమల్లో ఉన్న అట్రాసిటీస్ చట్టం తరహాలో బీసీలకు కూడా ప్రత్యేక బీసీ పరిరక్షణ చట్టం తీసుకురావాలని సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. బీసీలు మెజారిటీ ఉన్నప్పటికీ వారిపై జరుగుతున్న దాడులు వివక్షలను అరికట్టే రక్షణ లేకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. ఈరోజు నిర్వహించిన అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించి అసెంబ్లీలో ఆమోదానికి సిద్ధం చేస్తుందని, ఎస్సీల మాదిరిగా రక్షణ చట్టం కావాలని తెలంగాణ ప్రభుత్వం కూడా అదే దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలంటే వెనుకబడిన కులాలకు ప్రత్యేక పరిరక్షణ చట్టం అవసరం. వడ్డెర, పిచ్చకుంట్ల, బుడబుక్కల చాలా కులాలు సంచార జాతులుగా జీవిస్తున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి వద్ద సరియైన కుల గణాంకాలు లేకపోవడం వల్ల సమాజంలో అసమానతలు, దాడులు జరగడం వల్ల స్వేచ్ఛగా జీవించేటటువంటి పరిస్థితి లేదు. ప్రభుత్వం తక్షణమే ఆలోచన చేసి ఆంధ్రప్రదేశ్ లో మాదిరిగా తెలంగాణ లో కూడా బీసీలకు పరిరక్షణ చట్టం తేవాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న బిక్షమయ్య ,గిరి, ఆరె కంటి శ్రీనివాస్ గౌడ్ ,చిట్టిపోలు వెంకన్న ,భీమా గౌడ్ పాల్గొన్నారు

# ఉరుమడ్లలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం... లబ్ధిదారులకు నగదు ప్రోత్సాహం

### ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ పల్లపు బుద్ధుడు ప్రోత్సాహకంగా రూ.10,016 అందజేత

**చిట్యాల రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామంలో తొలి ఇల్లు పూర్తి చేసిన లబ్ధిదారుడు చెరుకు సైదమ్మ సైదులు దంపతులతో అధికారులు, నాయకులు గృహప్రవేశం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు పల్లపు బుద్ధుడు హాజరై పూజల్లో పాల్గొన్నారు. లబ్ధిదారు లను శాలువాలతో సన్మానించి, ప్రోత్సాహకంగా రూ.10,016 నగదు బహుమతిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎదురుచూసిన పేదల సొంతింటి కలను నిజం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల్లో ఆనందం నింపు తోందన్నారు. పేదలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో



చేపట్టిన ఈ గృహనిర్మాణ కార్యక్రమం సామాజిక సమానత్వానికి నిదర్శ నమని తెలిపారు. సొంతింటి కల నెరవేరిన ఆనందం లబ్ధిదారుల ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ పథకం అమలుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తెలంగాణ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలి

### సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్

**చిట్యాల రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** రైతులు తమ పాడి పశువులను గాలికుంటూ వ్యాధి నుంచి రక్షించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్ సూచించారు. చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి డాక్టర్ మల్లారెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటూ వ్యాధి సోకితే పాలు తగ్గడం, పశువులు బలహీనపడటం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా పశువులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. పశువుల ఆరోగ్యం విషయంలో రైతులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఎడ్ల శ్రీశైలం, పాల కేంద్రం చైర్మన్ దాసరి సైదులు, గొర్రెల కాపరి సంఘం అధ్యక్షులు మెట్టు నరసింహా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటేష్, బొజ్జ బుచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.






# ఎన్ జి కళాశాల పాత విద్యార్థులకు మరో అవకాశం

### కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్



**నల్గొండ టౌన్ మార్చి 25, ప్రభాతవార్త:** నల్గొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో 201112 నుండి 202223 విద్యా సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు డిగ్రీ మూడు సంవత్సరాలు పూర్తి చేసి ఫెయిల్ అయిన విద్యార్థులకు బ్యాక్లాగ్ పరీక్షలు జూన్/ జులై 2026 లో పరీక్షలు నిర్వహించబడతాయని కళాశాల ప్రిన్సిపాల్/ ప్రొఫెసర్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మరియు పరీక్షల నియంత్రాణాధికారి డా. డి. మునిస్వామి తెలిపారు. వారు మాట్లాడుతూ.. బ్యాక్ లాగ్ పరీక్షలు వ్రాసే విద్యార్థులు కళాశాలలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీస్ లో పరీక్ష దరఖాస్తు ఫారం తీసుకుని ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి పరీక్ష దరఖాస్తు ఫారంతో పాటు ఆన్లైన్లో కట్టిన ఫీజు రసీదుతో బ్యాక్ లాగ్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్ష ఫీజు 25032026 నుండి 15042026 ఎప్పుడైనా చెల్లించవచ్చని అన్నారు. ఇతర వివరాలకు కళాశాలలోని నోటీస్ బోర్డు చూడాలని తెలిపారు.

# బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవం

**దేవరకొండ,మార్చి 25, ప్రభాత వార్త :**



దేవరకొండ బార్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సన్నాయిల ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వనం జగదీశ్వర్, కోశాధికారి ఈడం రవికుమార్, ఉపాధ్యక్షులుగా దుర్గ, శ్రీనివాస్ ,సహాయ కార్యదర్శులు చిలువేరు పుష్పలత, ఎం యాదయ్య, కల్చరల్ కార్యదర్శి శంకర్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అధికారిగా రియాజుద్దీన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, లోహిత్ రెడ్డి, శౌకత్ అలీ, ఇంద్రవరప్రసాద్, ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

# స్నేహితురాలికి ఆర్థిక సాయం చేసిన పూర్వ విద్యార్థులు



**చిట్యాల రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** తమతో కలిసి చదివిన బాల్య మిత్రురాలు కష్టాల్లో ఉందని తెలిసి అండగా నిలిచారు పూర్వ విద్యార్థులు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200203 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితురాలికి ఆర్థిక సాయం చేశారు. తమ స్నేహితురాలు ఆగ్రామపంచాయతీ పరిధిలోని మొర్సుగూడెంకు చెందిన సుర్కంటి శోభ భర్త ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు స్నేహితుల మధ్య సమాచారాన్ని పంచుకుని కొంత డబ్బు జమచేశారు. అలా పోగు చేసిన రూ.60వేలు నగదును మొర్సుగూడెంలోని స్నేహితురాలి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెను ఓదార్చి, మనోధైర్యాన్ని కల్పించారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**రామన్నపేట, మార్చి 25 ప్రభాతవార్త**



విధుల పట్ల ఎవరైనా నిరక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వారు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో వైద్యులు సిబ్బంది ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. వైద్యులు సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతిరోజు ఓ.పి కి ఎంతమంది వస్తున్నారని ఓపి రిజిస్టర్ను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందిస్తున్నారా లేదా అని ఆసుపత్రికు వచ్చిన పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికలో డాక్టర్లు మంచిగా చూస్తున్నారా, సమయానికి మందులు ఇస్తున్నారా రక్త పరీక్షలు ప్రభుత్వాసుపత్రిలో చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతిరోజు శుభ్రపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శానిటేషన్ కాంట్రాక్టర్ కి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది సరిగా విధులకు హాజరు కావడం లేదని, వారు ఏజెన్సీ నిఎందుకు క్యాన్సల్ చేయలేదని అధికారులు ప్రశ్నించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి అక్కడ మొక్కల పెంపకం వాటి సంరక్షణను పరిశీలించారు. పెట్టిన మొక్కలు పెరగకుండా ఎండిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఆ మొక్కలను గ్రామాలలో నాటే కార్యక్రమాలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరూ చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఎంపీ ఓ రఫూఫ్ అలీ, ఏపీఓ వెంకన్న, బిల్ కలెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బీఎల్ఓలకు కీలక శిక్షణ

**గుండాల, మార్చి 25 ప్రభాతవార్త:**



స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ కార్యక్రమం నేపథ్యంలో గుండాల మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బూత్ లెవల్ అధికారులకు విస్తృత స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటరు జాబితా సవరణ పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలు, ఫారమ్ల స్వీకరణ, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. ప్రతి బీఎల్ఓ తమ పరిధిలో ఖచ్చితమైన ఓటరు వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాస్టర్ ట్రైనర్లు జంపాల రాజు, ఇట్టబోయిన నరేష్ శిక్షణ అందించారు. ఎన్నికల సూపర్వైజర్లు ఆర్.ఐ ప్రభుదాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రావు, జూనియర్ అసిస్టెంట్లు కృష్ణ, మాధవి, వెంకన్నతో పాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను పారదర్శకంగా, తప్పులులేకుండా పూర్తి చేయాలని అధికారులు ఈ సందర్భంగా బీఎల్ఓలకు సూచించారు.




## నియోజకవర్గ సాధన కోసం నిరంతర కార్యక్రమాలు చేపట్టాలి:

**నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్**

**రామన్నపేట, మార్చి 25 ప్రభాతవార్త**



పునర్విభజనలో భాగంగా రామన్నపేట ను నియోజకవర్గంగా ప్రకటించే అవకాశాలు ఉన్నందున, నియోజకవర్గ సాధన కోసం నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో ఇకనుండి నిరంతర కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని ఆనందపేట నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రామన్నపేటకు నియోజకవర్గంగా ఉండటానికి అన్ని అవకాశాలు ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని, అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి అని, భౌగోళికపరంగా పాలన చేయడానికి అన్ని వసతులు అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రామన్నపేట ను నియోజకవర్గంగా ఏర్పాటు చేయించడానికి అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ సొంత ఎజెండాగా ముందుకు రావాలని కోరారు. నియోజకవర్గ సాధన లో భాగంగా ఇకనుండి ప్రణాళిక ప్రకారం సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి, కేంద్ర మంత్రులకు కలిసి మెమొరండాలు ఇవ్వాల్సి ఉంటుందని, సదస్సులను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ధర్నాలు, నిరాహార దీక్షలు చేసి నియోజకవర్గం ఏర్పడే దిశగా ముందుకు సాగుతుందని తమ ప్రణాళికను తెలిపారు.

## దాడికి పాల్పడిన వారిని రిమాండ్ కు పంపాలి

**బీబీనగర్, మార్చి 25 ప్రభాతవార్త**



:దళితుడి పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు అయిన తర్వాత నిందితులను వెంటనే కోర్టుకు రిమాండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు బట్టు రామచంద్రయ్య లు డిమాండ్ చేశారు. మండలంలోని మగ్దంపల్లి గ్రామంలో ఈనెల 28 ఎస్సీ కులానికి చెందిన ఒగ్గు పాండు ను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం డి.ఎస్.పి రవీందర్ ను కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండారు నరసింహ, మట్ట జహంగీర్ గౌడ్, జక్కి నగేష్, మొలగరం పాండు, మట్ట శ్రీను, అశోక్, గణేష్ తదితరులు ఉన్నారు.

## పాత కొత్త పెన్షనర్ల విభజన చట్టం రద్దు చేయాలి

**మోత్కూర్, మార్చి 25 ప్రభాతవార్త:**

పెన్షనర్లను పాత, కొత్తగా విభజించే వ్యాలిడేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మోత్కూర్ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం తహసీల్దార్కు వినతి పత్రాన్ని సమర్పించారు. గత సంవత్సరం ఇదే రోజున ఆర్థిక బిల్లులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయడంతో దేశవ్యాప్తంగా పెన్షనర్లలో అసంతృప్తి నెలకొన్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఇప్పటికే లక్షలాది మంది పెన్షనర్ల సంతకాలతో ప్రధానమంత్రికి వినతి పత్రాలు అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి. యాదిరెడ్డి, కార్యదర్శి వల్లభాయి, కోశాధికారి వి. యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు అవిలిమల్లు, మాజీ అధ్యక్షులు ఎం. ఆనందం, ఏ. సత్యనారాయణ, హెచ్. చంద్రరావు, ఉపాధ్యక్షులు టి. మనోహరాచారి, ఎస్. యాదగిరి లక్ష్మి, ఎస్. యాదగిరి, సత్తయ్య, కే. యాదయ్య, జె. యాదయ్య, ఎం. రామయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం

**భువనగిరి రూరల్ మార్చి 25 ప్రభాతవార్త**



మున్సిపల్ ఎన్నికలు ముగిసి 45 రోజులు గడిచినప్పటికీ ప్రజా సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారని బిఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో మహిళ స్వయం సహాయక సంఘాలకు అందజేయవలసిన ప్రభుత్వ రుణాలను అక్రమంగా కొంతమంది బ్యాంకు ఉద్యోగులు, మెప్మా అధికారులు, ఆర్పీలు దుర్వినియోగం చేసిన దానిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వ అధికారులు విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపించి సంబంధిత అవినీతిపరులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ వి కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ లు, నాయకులు చెన్న స్వాతి మహేష్, నాకోటి నగేష్, చీమల రాజు, ఏలే భువనేశ్వరి శివ, తాడూరు బిక్షపతి, తాడెం రాజశేఖర్, నువ్వుల సుధాకర్, సుభాష్, సైదులు, మధు తదితరులు పాల్గొన్నారు

## యంత్రలక్ష్మి పథకం రైతుకు ఆధునిక అండ

**అడ్డగూడూరు, మార్చి 26 (ప్రభాతవార్త)**



:రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'యంత్రలక్ష్మి పథకం గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఫలితాలను ఇస్తోంది. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చి రైతుల భారం తగ్గించే దిశగా ఈ పథకం కీలకంగా మారుతోంది. ఈ క్రమంలో అడ్డగూడూరు మండలానికి గడ్డి కట్టల మెషీన్ (బేలర్) మంజూరు కాగా, చౌల్లరామారం గ్రామానికి చెందిన రైతు పురుగుల మల్లేష్కు బుధవారం అధికారులు అందజేశారు. ఈ యంత్రం ద్వారా పంట అవశేషాలను సులభంగా నిర్వహించడంతో పాటు పశువుల మేతను నిల్వ చేసుకోవడానికి కూడా ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా రైతు పురుగుల మల్లేష్ మాట్లాడుతూ, యంత్రలక్ష్మి పథకం చిన్న, సన్నకారు రైతులకు ఎంతో తోడ్పడుతోందని తెలిపారు. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో ఖర్చులు తగ్గి, పనులు వేగంగా పూర్తవుతున్నాయని చెప్పారు. మహిళా రైతులకు కూడా ఈ పథకం ద్వారా లాభం చేకూరుతోందని పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

మిర్యాలగూడ, మార్చి 25 ప్రభాతవార్త

మిర్యాలగూడ ఓటర్ నమోదు అధికారి సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ మండలం, మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్ల నమోదు మార్పులు, చేర్పులు, ప్రత్యేక సమగ్ర సర్వే సర తదితర విషయాలపై బుధవారం బూత్ లెవెల్ ఆఫీసర్స్, బూత్ లెవెల్ సూపర్వైజర్స్ కు శిక్షణ కార్యక్రమాన్ని రైతు వేదికలో బుధవారం నిర్వహించారు. సహాయ ఓటర్ నమోదు అధికారి తహశీల్దార్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అధికరణ 324, 325, 326 ప్రకారము, ఎన్నికల సంఘ నియమావళిని అనుసరించి ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే ఆధారంగా ప్రతి ఓటర్ పూర్తి వివరాలను నమోదు చేయాలని 1987కు ముందు ఓటరుగా నమోదు అయినటువంటి వ్యక్తులకు ఎటువంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని 1987 నుండి 2004 మధ్యలో ఓటర్ గా నమోదు కావాలి అన్నప్పుడు తల్లి లేదా తండ్రిది ఏదైనా ఆధార పత్రాన్ని జతపరచాలని, 2004 తర్వాత ఓటరుగా నమోదు అయిన వారు తల్లి, తండ్రి ఆధార పత్రాలను జత చేయాలని, ఈ విషయాలను తెలియజేయడం



కోసం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి బిఎల్ఓలకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ నిర్వహించారు. ప్రతి బిఎల్ఓ మీ ప్రాంతంలో ఉన్న అన్ని విషయాలపై సమగ్రమైనటువంటి అవగాహన కలిగి ఉండి ఫామ్ 6,7,8 లకు సంబంధించిన ఓటర్ల నమోదు పై అవగాహన ఏర్పరచుకొని క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని, పరిపూర్ణమైన ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నాయబ్ తహసీల్దార్ఆర్. ప్రవీణ్ కుమార్ జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య యాదవ్, అంబటి శ్రీను, ఆర్ ఐ ఠాగూర్ రామకృష్ణ, ,పవన్ సూపర్వైజర్లు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



## వాలిడేషన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

మిర్యాలగూడ, మార్చి 25 ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 వాలిడేషన్ చట్టం రద్దు చేయాలని కోరుతూ మిర్యాలగూడ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ చట్టంతో రిటైర్డ్ ఉద్యోగులకు పిఆర్సి, డిఏ ఇతర అలవెన్స్ లభించవని, పెన్షన్ దారులకు శాపంగా మారిన వాలిడేషన్ చట్టం వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయని పక్షంలో పెన్షన్ దారులు సమిష్టిగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, శేఖర్, గోపయ్య,పీడీ ఎడ్విన్, ఎల్. రమేష్, వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఏదు కొండల్, జానకి రాములు, మహమూద్ అలీ, యాదిరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

# గ్రామాల భివృద్ధికి శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలి

మిర్యాలగూడ. మార్చి 25. ప్రభాతవార్త:.

గ్రామాల సమగ్రాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని వారికి చట్టాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎంపీడీవో ఎం.శేషగిరి శర్మ అన్నారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23 నుండి 28 వరకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామపంచాయతీ తీర్మానాలు, గ్రామ సభల నిర్వహణలో వార్డు సభ్యుల పాత్ర, ఎజెండా తదితరాంశాలపై శిక్షకులు సతీష్,దుర్గయ్య, మురళీమోహన్ లు వారికి అవగాహన కల్పించారు. శిక్షణ సమయంలో వారికి ఇచ్చిన కరదీపికలను అధ్యయనం చేయడంతో పాటు శిక్షణలో నేర్చుకున్న పలు అంశాలను క్షేత్రస్థాయిలో అమలుపర్చి పాలకమండలి సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి పంచాయతీ పాలకమండలి సమిష్టి సమైక్య నిర్ణయాలతో ప్రజా భాగస్వామ్యంతో జవాబిదారితనంగా



రాజకీయాలకతీతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ మాతంగి రమేష్, కార్యాలయ పర్యవేక్షకులు కరుణాకర్ రావు, సీనియర్ నాయకులు ఎండి జమాల్ పాషా, టైపిస్ట్ ఫిరోజ్, సిబ్బంది నారాయణదాసు మణికంఠ, గ్రామ ఉప సర్పంచులు కుసుమ సుదర్శన్ రెడ్డి,చిర్ర మల్లేష్ యాదవ్, చింతకాయల సతీష్ యాదవ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి యాగము ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై, మిల్లర్స్ కోశాధికారి

మిర్యాలగూడ,మార్చి 25 ప్రభాతవార్త



ఈనెల 27 శుక్రవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పి క్యాంప్ మైదానంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్రరామానుజ జీయర్ స్వామివారి సంకల్పంతో వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరగనున్న శ్రీ మహాలక్ష్మి యాగము ఏర్పాట్లను బుధవారం సాయంత్రం టూ టౌన్ ఎస్ఐ బొలిశెట్టి రాంబాబు,మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి గండె రాములు పరిశీలించారు. వారి వెంట వనపర్తి శ్రీనివాస్, పాల్వాయి సురేష్, రేపాల పురుషోత్తం రెడ్డి, యాగ కమిటీ సభ్యులున్నారు.

## పట్టణ అభివృద్ధికి పన్నులే ఆధారం

మిర్యాలగూడ, మార్చి 25 ప్రభాతవార్త



పట్టణ అభివృద్ధికి పన్నులే ఆధారమని, పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లపై అవసరం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. నోటీసులు జారీ చేసినప్పటికీ ఇంకా పన్నులు చెల్లించని డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి ఉంచినట్లు పేర్కొన్న కమిషనర్ ప్రత్యేక బృందాలతో అన్ని వార్డుల్లో ఇంటింటి తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. బకాయి చెల్లించనిచో జరిమానా, చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

## పెట్రోల్ కొరతను నివారించి..ప్రజల ఇబ్బందులను తొలగించాలి

మిర్యాలగూడ, మార్చి 25 ప్రభాతవార్త

పెట్రోల్ కొరతను నివారించాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు తిరందాసు విష్ణు ప్రభుత్వాలను కోరారు. ఒకవైపు పెట్రోల్ డీలర్లు ప్రభుత్వ, యంత్రాంగం పెట్రోల్ కొరత లేదని పేర్కొంటున్నప్పటికీ బంకులలో నో స్టాక్ బోర్డు పెట్టడం సరైంది కాదన్నారు. పెట్రోల్ కొరత కారణంగానే సగం బంకులలో నో స్టాక్ బోర్డు పెట్టారన్నారు. బంకుల దగ్గర విపరీతమైన రద్దీ



నెలకొందని,తక్షణమే పౌర సరఫరాల శాఖ స్పందించి అన్ని బంకుల్లో పెట్రోలు కొరత లేకుండా చూడాలన్నారు. పెట్రోల్ కొరతతో మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తక్షణమే స్పందించి పెట్రోల్ కొరతను నివారించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ, మార్చి 25 ప్రభాత వార్త

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్ డిమాండ్ చేశారు. ఈనెల 25న ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లనీయకుండా మిర్యాలగూడ గ్రామీణ పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం కేటాయింపు చేయాలని, అన్ని భవనాలలో నడుస్తున్న గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, కళాశాలలకు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలలో విసి2020 అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.రాష్ట్ర యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. వసతిగృహ విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే చేయాలన్నారు. అరెస్టు చేసిన వారిలో బన్నీ,గోపి,రెహాన్,ఇర్ఫాన్,గణేష్ ఉన్నారు.

## దరఖాస్తుల గడువు పొడగింపు

మిర్యాలగూడ,మార్చి 25. ప్రభాతవార్త:.

షెడ్యూలు కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలలో భాగంగా జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో అర్హులైనఅభ్యర్థుల నుండి ఆహ్వానించిన దరఖాస్తుల సమర్పణ గడువు వచ్చే నెల రెండు వరకు పొడిగించినట్లు మిర్యాలగూడ





కమిషనర్ జె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేస్తూ జిల్లాలోని ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 202520 26 అమలులో భాగంగా వివిధ స్వయం ఉపాధి పథకాల కింద అర్హులైన అభ్యర్థులు నిర్ణీత పోర్టల్ ద్వారా అంతర్జాల దరఖాస్తుల సమర్పణకు గడువు పొడిగించినందున అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## కామాఖ్య అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ను ఆపాలి

మిర్యాలగూడ, మార్చి 25. ప్రభాతవార్త:.

వ్యాపార, వాణిజ్య పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో చర్లపల్లి కామాఖ్య అమృత భారత్ ఎక్స్ప్రెస్ రైలును మిర్యాలగూడ రైల్వే స్టేషన్ లో ఆపాలని తెలంగాణ రాష్ట్ర బీసీవై పార్టీ పీఏసీ సభ్యులు, మిర్యాలగూడ ఎమ్మెల్యేగా పోటీ చేసిన బొడ్డు వెంకన్న యాదవ్ కోరారు. ఆయన ఈ మేరకు బుధవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ కు వినతి పత్రం అందజేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన పెద్ద సంఖ్యలో వలస కార్మికులు ఇక్కడ పలు కర్మాగారాలలో పనిచేస్తుండటం వల్ల ఇక్కడ రైల్వే స్టాప్ లేకపోవడంతో వారు స్వగ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది విద్యార్థులు ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్నందున వారితోపాటు ఆధ్యాత్మికంగా ఆర్యవైశ్యుల ఇష్టదైవమైన కామాఖ్య దేవాలయానికి ఈ ప్రాంత ఆర్యవైశ్యులు పలు దేవాలయాలకు యాత్రలు చేస్తుంటారని ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రయాణ ఇబ్బందులు తొలగిస్తుందన్నారు. ఈ విషయాన్ని సానుభూతితో పరిశీలించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# పెట్రోల్ బంకులలో బారులు తీరిన వాహనాలు

## డ్రమ్ములలో నిల్వ చేసుకుంటున్న రైతులు




**నేరేడుచర్ల మార్చి 25 ప్రభాతవార్త** యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందని నేరేడుచర్ల లోని పెట్రోల్ బంకులలో వాహన చోదకులు రైతులు వాహనాలతో బారులు తీరారు, స్థానిక పెట్రోల్ బంకుల యజమానులు పెట్రోల్, డీజిల్ కొరతలేదని ప్రకటిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు తమ వాహనాల లో ని ట్యాంకుల నిండా పెట్రోల్ పోయించు కోవడం, భారీ వాహన యజమానులు తమ వాహనాలలో ట్యాంకులను నింపుకోవడం, ప్రస్తుతం ఆయకట్టులో వరి కోతలు ముమ్మరంగా కొనసాగు తుండగా వరి కోతలకు, కోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి డీజిల్ అత్యవసరం కావడంతో డీజిల్ కొరత ఏర్పడుతుందని ధాన్యాన్ని కోయలేమని సకాలంలో అమ్ముకోలేమని రైతులు డ్రమ్ములు కొనుగోలు చేసి డ్రమ్ముల నిండా డీజిల్ నిల్వ చేసుకోవడంతో స్థానిక అన్ని పెట్రోల్ బంకులు వాహనాలతో నిండిపోయాయి, రైతులు వాహన చోదకులు వాహన యజమానులు ఒకేసారి బంకులలో బారులు తీరడంతో రెండు మూడు రోజులు రావలసిన డీజిల్ కొద్ది గంటల్లోనే బంకులలో డీజిల్ నిల్వ లేకుండా అయ్యింది, ఇప్పటివరకు హైదరాబాద్ తదితర పట్టణాలలో డీజిల్ పెట్రోల్ కొరత ఉందని వదంతులు రాగా నేడు చిన్న చిన్న పట్టణాలు మండల కేంద్రాలలో కూడా డీజిల్ పెట్రోల్ కొరత ఏర్పడుతుందని నిల్వ చేసుకుంటుండడంతో బంకుల వద్ద వాహనాల రద్దీ కనిపించింది

# హుజూర్ నగర్ వార్త

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**నేరేడుచర్ల మార్చి 25 ప్రభాతవార్త**



నేరేడుచర్ల మండలం దాచారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా గంధం హరికుమార మండల విద్యాశాఖ అధికారిగా షేక్ రియాన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా జిల్లా మనోజ్ ప్రధానోపాధ్యాయులుగా శివాని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులుగా వర్ష, నిహారిక, పూజిత, భవాని, గాయత్రి, యశస్విని, శివకుమార్, రేవంత్ సాయి, సుశాంత్, యశ్వంత్ లు వ్యవహరించి విద్యార్థిని విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి వీణారాణి ఉపాధ్యాయులు యడవల్లి సత్యనారాయణ రెడ్డి పుల్లయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు

# రామాలయంలో ఘనంగా గోరింటాకు పండగ

**గరిడేపల్లి, మార్చి 25, ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన గరిడేపల్లిలోని కోదండ రామాలయంలో బుధవారం మహిళా భక్తులు శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. రామాలయంలో మహిళా భక్తులు సీతారాముల కళ్యాణం సందర్భంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం పసుపు చిట్లించటం, మహిళలందరూ కలిసి ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికే కళ్యాణం కోసం గోటి తలంబ్రాలను మహిళలు సిద్ధం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది శ్రీరామనవమి పండుగకు ముందే రోజుకు ఒక కార్యక్రమాన్ని మహిళా భక్తులు నిర్వహించడం విశేషం. గతంలో స్వామి వారి కళ్యాణం అనంతరం ఐదు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇప్పుడు స్వామి వారి కళ్యాణం కంటే ముందుగానే ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని చేపడుతూ కళ్యాణమనంతరం ఐదు రోజులపాటు నిర్వహించి చివరి రోజున పవళింపు సేవ కార్యక్రమంతో శ్రీరామనవమి ఉత్సవాలను ముగిస్తారు. ఆలయ చైర్మన్ పెండెం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుదర్శన శ్రీనివాసాచార్యులు, రాజన్ ఆచార్యులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాలిడేషన్ యాక్ట్ 2025ను రద్దు చేయాలని వినతి

**నేరేడుచర్ల మార్చి 25 ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో ఆమోదించిన వ్యాలిడేషన్ యాక్ట్ 2025ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీజీ ఆర్ఈఏ ఆధ్వర్యంలో పెన్షనర్లు నేరేడుచర్ల తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు, ప్రభుత్వం పెన్షనర్లను రెండు గ్రూపులుగా విభజించి జనవరి ఒకటి 2026 ముందు పదవి విరమణ పొందిన వారు, తర్వాత పదవీ విరమణ పొందిన వారిగా విభజించి కటాఫ్ డేటాకు ముందు పదవి విరమణ అయినవారికి పిఆర్ సి, డి ఆర్ తదితర ప్రయోజనాలను రద్దు చేశారని దీనిని నిరసిస్తూ పార్లమెంటులో ఆమోదించిన చట్టాన్ని రద్దు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, కార్యదర్శి పోతుగంటి సత్య నారాయణ, బొద్దుపల్లి సుందరయ్య, పో రెడ్డి శ్రీరామ్ రెడ్డి, ఉప్పల లక్ష్మా రెడ్డి, జిలకర రామస్వామి, సీతారాములు, జి సైదిరెడ్డి, లక్ష్మీ కాంతమ్మ, ధెరిసా, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు

# 2025 వాలిడేషన్ చట్టంను వెంటనే రద్దు చేయాలి

**హుజూర్ నగర్ టౌన్, మార్చి 25, ప్రభాతవార్త :**




కేంద్ర ప్రభుత్వం 2025 లో తెచ్చిన వాలిడేషన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ హుజూర్ నగర్ మండల ప్రభుత్వ పెన్షనర్లు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రకటించారు. చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం హుజూర్ నగర్ ఆర్డీవో వి. శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం ప్రధానమంత్రికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాలిడేషన్ చట్టం దేశంలో పెన్షనర్లను విభజించే విధంగా ఉందని తీవ్రంగా ధ్వజమెత్తారు. జనవరి 2026 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి మాత్రమే వేతన సవరణ ప్రయోజనాలు చేకూరుతాయే తప్ప అంతకు ముందు రిటైర్ అయిన వారికి ఎలాంటి ప్రయోజనాలు ఉండవన్నారు. ఈ వ్యాలిడేషన్ చట్టం రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకం గా ఉందని ధ్వజమెత్తారు. చట్టం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం నాయకులు కొప్పుల వీరారెడ్డి, ఎం బి దేవదా నం, ఎన్ వెంకటేశ్వర రావు, పి చంద్రశేఖర్, ఎన్ రఘునాథ్, ఎం ఎస్ ఎన్ రా జు, కే లక్ష్మయ్య, ఎల్ వెంకటే శ్వర్లు, ఎల్ సత్యనారాయ ణ, మోహన్ రావు, వేముల వెంకటేశ్వర్లు, పి ఎల్ ఎన్ రెడ్డి, పి గురవయ్య, ఖాజా, పాపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు పెంచికల్ దిన్నలో మెగా వైద్య శిబిరం

**నేరేడుచర్ల మార్చి 25 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగాఈ నెల 26న పెంచికల్ దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వై సీతామహాలక్ష్మి బుధవారం తెలిపారు, ఈ శిబిరంలో ఆయేషా స్త్రీ ల ప్రత్యేక వైద్య నిపుణులు, సుష్మ చిన్నపిల్లల వైద్య నిపుణులు , సమీరా కంటి వైద్య నిపుణులు , మీనా కీళ్ళు , ఎముకల వైద్య నిపుణులు. యశ్వంత్ దంత వైద్య నిపుణులు. రవి జనరల్ మెడిసిన్ నిపుణులు ఉచిత వైద్య పరీక్షలు చేయనున్నారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025 రద్దు చేయాలి

**గరిడేపల్లి,మార్చి 25, ప్రభాతవార్త :**



పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గరిడేపల్లి మండలంలో రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రవంతికి బుధ వారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుందరి నాగయ్య మాట్లాడుతూ,ఈ చట్టం అమలులోకి వస్తే 2026 జనవరి 1కు ముందు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పి.ఆర్.సి. ప్రయోజనాలు,డి.పి.ఆర్.లు వర్తించవని తెలిపారు.ఇది దాదాపు 54 సంవత్సరాలుగా ప్రభుత్వానికి సేవలందించిన పెన్షనర్లకు తీవ్రమైన అన్యాయం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పెన్షనర్ల హక్కులను హరించే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని,వారికి న్యాయం చేయాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.పెన్షనర్ల సంక్షేమం కాపాడాలని,వారి హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వెంటనే స్పందించాలి అని సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అందె సత్యనారాయణ తో పాటు వివిధ వర్గాల రిటైర్డ్ ఉద్యోగ సంఘాల మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మేళ్ళచెరువులో 26న ఉచిత హోమియో వైద్యశిబిరం

**మేళ్ళచెరువు మార్చి 25 ప్రభాతవార్త** స్థానిక శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభూశంభు లింగేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణములో ఈనెల 26వ తేదీ గురువారంరోజున కృష్ణమా చార్య ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్య ములో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని మంగళ వారం కార్యనిర్వాహ ణాధికారి నాగేళ్ళ శంభిరెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత పరీక్షలు, ఉచితంగా మందులు అందచేస్తామని స్థానిక ప్రజలు మండల అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 26వ తేదీన అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలి

**మేళ్ళచెరువు మార్చి 25 ప్రభాతవార్త** మండల కేంద్రమైన మేళ్ళచెరువులో బుధవారం జరిగిన డి.వై.యఫ్.ఐ. మండల స్థాయి సమావేశములో మండల కార్యదర్శి భావన ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వము ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 26వ తేదీన నిర్వహించే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని యువత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగభృతి, జాబ్క్యా లెండర్, ఉద్యోగముల భర్తీ నోటిఫికేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు

**యాదగిరిగుట్ట మార్చ్ 25, (ప్రభాత వార్త ):**

యాదగిరిగుట్ట పట్టణంలోని 2 వ వార్డు కు చెందిన సీనియర్ నాయకుడు మోతే నరసింహ నాయకత్వంలో సుమారుగా వంద మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి పార్టీ లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం, స్థానం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో దొంగ హామీలను ఇచ్చిందని వాటిని నమ్మి మోస పోయామని చాలామంది కాంగ్రెస్ ను విడిచి బిఆర్ఏస్ పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి పాలన చేసే దమ్ము ధైర్యం లేదని ఆయన అన్నారు. తెలంగాణను పాలించే సత్తా ఒక



టిఆర్ఎస్కు తప్ప ఏ పార్టీకి లేదని ఆయన పేర్కొన్నారు . పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య , పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్ రాజేష్ యాదవ్, నర్సింగం పురుషోత్తం, మోతే బాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరం

**తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవార్త**



తుర్కపల్లి మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ సోమల వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశోద డాక్టర్ రుచిరా రెడ్డి లు మాట్లాడుతూ ఈ క్యాంపులో ప్రత్యేక వైద్య నిపుణులు, వివిధ అనారోగ్య సమస్యలు జనరల్ మెడిసిన్, స్త్రీలు, ఎముకల, కంటి, పిల్లల, డెంటల్ సర్జన్లచే మండల పరిధిలోని 125 మంది అనారోగ్య వ్యక్తులకు పరీక్షలు చేసి చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, సిహెచ్ఓ రాజయ్య ,పి హెచ్ ఎన్ బిస్మిల్లాబి, హెచ్వి దయామని ,ఎం పి హెచ్ ఎ జానీ పాషా, సునీల్ కుమార్ కరీంబి ఏఎన్ఎం సుహాసిని, ఫార్మసిస్ట్ సిద్దేశ్వర్ ,అంజలి, ఉమారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

**తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవా ర్త**



తుర్కపల్లి మండలం ధర్మారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచు రజిని సురేందర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 95 గేదలు, ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ ఎస్ ఏ శేఖర్ , వెటర్నరీ అసిస్టెంట్ శంషుద్దీన్, రాఘవేందర్, గోపాలమిత్ర వీరు, బాలేష్, ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు

# తుర్కపల్లిలో వైభవంగా బ్రహ్మోత్సవాల ప్రారంభం

**తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవార్త** తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామ పురోహితుడు రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహ వాచనం, ప్రతిష్ట దేవతలకు అభిషేకం, అర్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులపాటు వేడుకలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం రోజున ఉదయం శ్రీ ఆంజనేయ స్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం ,పంచామృతాభిషేకం, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి మూల మంత్ర సహిత రుద్ర హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

# 11వ వార్డులో సీసీ నిర్మాణానికి శంకుస్థాపన

**యాదగిరిగుట్ట మార్చ్ 25, (ప్రభాత వార్త ):**



యాదగిరిగుట్ట, మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ మాట్లాడుతూ ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి యాదగిరిగుట్ట మున్సిపాలిటీ నీ రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. అదేవిధంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఆమె అన్నారు. 12 వార్డులలో నాణ్యమైన సిసి రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. అదేవిధంగా 11వ వార్డు కౌన్సిలర్ ముకర్ల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో సీసీ రోడ్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్ కౌన్సిలర్లు బూడిద మధు తదితర స్థానిక వార్డు కౌన్సిలర్లు నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, బందారపు బిక్షపతి , గుడ్ల నరేష్ కుమార్ మున్సిపల్ కమిషనర్ లింగస్వామి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు రాజపేట తైబజారు వేలం పాట

**రాజాపేట, మార్చి 25 ప్రభాతవార్త** రాజాపేట మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే సంత తైబజారు వేలంపాట ఈనెల 26వ తేదీ గురువారం జరగనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిలు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కూడలి వద్ద ఉదయం 11 గంటలకు వేలంపాట జరగనుందని, వేలంపాటలో పాల్గొనేవారు ఉదయం 10 గంటల వరకు పదివేల రూపాయల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. పంచాయతీ పొందుపరిచిన నిబంధనలకు లోబడి వసూలు నిర్వహణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సర్పంచి కోయ మధు అధ్యక్షతన ఉపసర్పంచి వార్డు సభ్యుల, గ్రామ పెద్దల సమక్షంలో వేలంపాట ఉంటుందన్నారు. వేలంపాటలో దక్కించుకున్న వారికి సంవత్సర కాలం పాటు హక్కులు ఉంటాయని చెప్పారు

# ఎస్సీ నిరుద్యోగ యువతకు ఏప్రిల్ 2 వరకు దరఖాస్తుల కోసం పొడిగింపు

**రాజాపేట, మార్చి 25 ప్రభాతవార్త** నిరుద్యోగులైన షెడ్యూల్డ్ కులముల యువతకు ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2024 25 సం. 11 యూనిట్ల మంజూరు నిమిత్తము ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు గాను ఈనెల 24 చివరి తేదీ కాగా, ఇట్టి తేదీని ఏప్రిల్ ,2 వరకు పొడిగించుట జరిగినదని ఎంపీడీవో నాగవేణి బుధవారం తెలిపారు. నిరుద్యోగ యువతి, యువకులు ఇట్టి అవకాశమును సద్వినియోగం చేసుకొని ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు, రిజిస్ట్రేషన్ అనంతరం వాటి డాక్యుమెంట్స్ హార్డ్ కాపీ సెట్టును కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో నాగవేణి కోరారు. ఇప్పటివరకు 80 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.




# మొగులయ్య మృతి సిపిఐ పార్టీకి తన కుటుంబానికి తీరని లోటు

**మోటకొండూర్, మార్చి 25, ప్రభాతవార్త:**



మొగులయ్య మృతి సి పి ఐ పార్టీకి తన కుటుంబానికి తీరని లోటు అని సి పి ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్య నారాయణ అన్నారు. సి పి ఐ సీనియర్ నాయ కులు బోగారం మొగు లయ్య గత కొద్ది రోజుల నుండి అనారో గ్యంతో బాధ పడుతూ బుధవారం ఉదయం మరణించగా ఆయన మృతి దేహానికి సి పి ఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, సి పి ఐ సీనియర్ నాయకులు రేగు యాదయ్య,సత్యనా రాయణ తో కలిసి మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తన చిన్నతనం నుండి సి పి ఐ పార్టీలో పనిచేస్తూ కీలక పాత్ర పోషించిన నాయకుడు అని అన్నారు.మోటకొండూర్ గ్రామ పంచాయతీ లో పనిచేసుకుంటూ ఏ ఐ టీ యూ సీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ లోముఖ్య పాత్రపోషించిన నాయకుడు ఆయన తుదిశాస వరకు కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ మృతిచెందారు. అని అన్నారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ నాయకులు నల్ల రాములు, బీరకాయల మురళి, వంగపల్లి సాయిలు, పాండు, గుంశి, తదిత రులు పాల్గొన్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న పంచాయతీరాజ్ శాఖ సీఈఓ శోభారాణి

**యాదగిరిగుట్ట మార్చ్ 25 (ప్రభాతవార్త ):**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం పంచాయతీరాజ్ శాఖ సీఈవో శోభారాణి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆమెకు పాద అర్చకులు పూలమాలతో స్వాగతం పలికి గర్భాలయంలోని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆమెకు ఆలయ అర్చకులు వేద ఘనంగా వేదమంత్రాలతో ఆశీర్వచనాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తాండూర్ వెంకటాచార్యులు నరేష్ కుమార్ ఆచార్యులు శ్రీధర్ ఆచార్యులు ఆలయ అధికారులు ఏఈఓ రఘు చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి పన్నులు చెల్లించిన రాజపేట గ్రామపంచాయతీ పాలకవర్గం

**రాజాపేట, మార్చి 25 ప్రభాతవార్త** రాజపేట గ్రామపంచాయతీ పాలకవర్గం బుధవారం తమ పూర్తి ఇంటి పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. ఇంటి పన్ను రసీదులను




పంచాయతీ కార్యదర్శి సాయిలు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి కోయ మధు ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్ ఇతర వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పనులు పూర్తిగా చెల్లించి సహకరించాలని జిల్లాలోనే రాజపేటను ఆదర్శంగా నిలపాలని కోరారు. పాలకవర్గం మొత్తం 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నును పూర్తిగా చెల్లించాలమని చెప్పారు.

## జిల్లా సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా గిర్కాటి నిరంజన్ గౌడ్

చౌటుప్పల్, మార్చి 25 ప్రభాతవార్త



యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ ఫోరంజిల్లా ప్రధాన కార్యదర్శిగా గిర్కాటి నిరంజన్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని దండు మల్కాపురం గ్రామానికి చెందిన నిరంజన్ గౌడ్ ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ గా ఘన విజయం సాధించారు. టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షునిగా ఈ ప్రాంతంలో గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. నిరంజన్ గౌడ్ సర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నికైనందుకు ఈ ప్రాంత సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. నిరంజన్ గౌడ్ నాయకత్వంలో సర్పంచుల సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని జయప్రదం చేయండి

చౌటుప్పల్, మార్చి 25ప్రభాతవార్త



చౌటుప్పల పట్టణంలో శ్రీశ్రీశ్రీ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్స వాన్ని మే 13 ననిర్వహించడం జరుగుతుందని, విగ్రహ ప్రతిష్ట మహోత్స వ వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ మనుమయ, స్వర్ణకార సంఘం, దేవాలయ నిర్మాణ కమిటీలు సమావేశమై వేద పండితుల సమక్షంలో వేడుకలను నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు. విగ్రహ ప్రతిష్ట మహోత్స వాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షులు పంతంగి మదనాచారి, కార్యదర్శి శశిభూషణాచారిలు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి పోలోజు సత్యనారాయణచారి, గౌరవాధ్యక్షులు చానకొండ రాజాచారి, స్వర్ణకార సంఘం అధ్యక్షులు కందుకూరు కిషోర్, కార్యదర్శి ముటుకుల్లోజు శ్రావణి చారి, గౌరవాధ్యక్షులు దాసోజు భిక్షమాచారి, దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు పోలోజు శ్రీనివాస చారి, కార్యదర్శి పంతంగి నగేష్, కోశాధికారి దేవరకొండ నరసింహ చారి, గౌరవాధ్యక్షులు మండలోజు భిక్షమా చారి, రాచకొండ శ్రీనివాస చారి, మారయాచారి, పాండిచారి విశ్వరూప చారి, అను మోజు మత్స్యగిరి చారి, పోరోజు నాగేష్, లక్ష్మీ ృనారాయణ, యాదగిరి విశ్వకర్మ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 30న ఇందిరా పార్క్ వద్ద దీక్షకు తరలిరావాలి

మోతె, మార్చి 25 ప్రభాత వార్త...



మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని టి ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు డు మేడి పాపయ్య పిలుపునిచ్చారు.ఈ మేరకు, మోతె అధ్యక్షుడు ఉప్పల వినోద్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం మోతె మండల కేంద్రంలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వెంకన్న, బ్రద్రయ్య, సురేష్, నరేష్, హరీష్, సోమేష్, అజయ్, ప్రసాద్, ప్రసాదు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోగలరు

మాడుగులపల్లి, మార్చి 25ప్రభాతవార్త



జిల్లాలోని అన్ని కోర్టు పరిధిలోఈ నెల 28 న, జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నందున మండల ప్రజలు ఈ అవకాశాని ్ని,సద్వినియోగం చుకోవాలని ,మాడుగులపల్లి ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపారు. చెక్ బౌన్స్, కుటుంబ తాగదాలు, ఆస్తి తాగదాలు,భూ వివాదాలు, బ్యాంక్ వివాదాలతో ఇబ్బందులకు గురవుతున్న వారు,రాజి పడదగిన అన్ని కేసుల సత్వర పరిష్కారానికి, రాజి మార్గం ఈ లోక్ అదాలత్ అని తెలిపారు.

## తలంబ్రాలు వలవడం పూర్వజన్మ సుకృతం

చౌటుప్పల్, మార్చి25ప్రభాతవార్త



చౌటుప్పల్ లోని శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 27న నిర్వహించే తలపెట్టిన శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని కళ్యాణోత్సవాలకి కావాల్సిన తలంబ్రాలను వడ్లతో బుధవారం ఆలయ ప్రాంగణంలో మహిళా ప్రతినిధులు వలిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా స్వామివారి కళ్యాణోత్సవానికి ఉపయోగించి తలంబ్రాలను వడ్లతో వలవడం తమ పూర్వజన్మ సుకృతం అని, ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటూ తలంబ్రాలను తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త వర్కాల వెన్నెల, వెన్ రెడ్డి సంధ్య, బొబ్బిళ్ళ సంధ్య, కామిశెట్టి శ్రీదేవి,ఉప్పల కుసుమ, ముత్యాల రామ నర్సమ్మ, మచ్చ అంబిక, డాక్టర్ మంచి కంటి రాజేశ్వరి, ఉప్పల దీపిక, వనం మమత, దాడి పద్మ, నిమ్మల అండాలు, జూకంటి రేవతి, గర్దాసు లక్ష్మి ృ, యామిని, మల్లె శాలిని, రాజపేట శ్రీలత, మామిడి వెంకటమ్మ, నెక్కంటి అనూష ,రమాదేవి బద్దం స్వప్న, కథాల ఆశ, గోషిక లక్ష్మి ృ, బొడిగె లావణ్య, మచ్చ అంబిక తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి

చౌటుప్పల్, మార్చి 25ప్రభాతవార్త,



ఆమోదయోగ్యం కానీ వాలిడేషన్ ఆక్ట్ ను రద్దు చేయాలని కోరుతూ చౌటుప్పల్ మండల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు బుధవారం నిరసన దినం పాటించారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులలో విభేదాన్ని కలిగిస్తూ 2025 కు పూర్వం రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఒకరకంగా 2026 తరువాత రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మరొక రకంగా కరువు భత్యాన్ని, పే రివిజన్ కమిషన్ వ్యత్యాసమును కల్పింపచేయుటకు సృష్టించిన వాలిడేషన్ యాక్టును ప్రభుత్వము ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగులు చౌటుప్పల రెవెన్యూ డివిజనల్ అధికారి వెల్మ శేఖర్ రెడ్డి, మండల తహసీల్దార్ వీరాబాయిలకు వేర్వేరుగా వినతి పత్రం అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షులు భీమిడి మోహన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య, ఆర్థిక కార్యదర్శి బడుగు శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బాతరాజు ఆగయ్య, సంఘ నాయకులు చోల్లేటి రాజయ్య, నారగోని కృష్ణయ్య, బిక్కు నాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు




## దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలి

హాలియా, ప్రభాతవార్త, మార్చి 25:

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదని తాజాగా వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షి ంచాలని కేవిపిఎస్ జిల్లా జిల్లా అధ్యక్షులు కొండేటి శీను బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మరియు ఆర్టికల్ 25లను ఈ తీర్పు ఉల్లంఘిస్తున్నదని పేర్కొన్నారు. ఆర్టికల్ 15 ప్రకారం మతం, కులం ఆధారంగా వివక్ష చూపరాదని, ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను హామీ ఇస్తుందని తెలిపారు. మత మార్పిడి చేసుకున్న కారణంగా వ్యక్తికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. మత స్వేచ్ఛ ఆధ్యాత్మిక అంశమైతే, కులం ఒక సామాజిక సమస్య అని, ఈ రెండింటిని అనుసంధానం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ తీర్పు మత స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలపై ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, అవసరమైతే న్యాయపరంగా సవాలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు

## మృతికి ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులే కారణమని ఫిర్యాదు

హాలియా, ప్రభాతవార్త, మార్చి 25:

శారీరక దృఢత్వం మరియు బరువు నియంత్రణ కోసం జిమ్ కు హాజరవుతూ కొన్ని ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులను వినియోగించడంతోనే తరి అశోక్ (34) మృతి చెందాడని హాలియా పోలీస్ స్టేషన్లో మృతుని తండ్రి కుపాసుపల్లి గ్రామానికి చెందిన తరి యాదయ్య బుధవారం ఫిర్యాదు చేశారు. వృత్తిరీత్యా ఆర్ఎంపీ ప్రాక్టీస్ అయినా తరి అశోక్ గత కొంతకాలంగా బరువు తగ్గాలని జిమ్ కు వెళ్తూ ఆరోగ్య ఉత్పత్తులను వినియోగిస్తున్నాడని ఈనెల 16వ తేదీన శ్రీరామ్ పల్లిలో ఒక శుభకార్యానికి వెళ్లి అక్కడ భోజనం, మద్యం సేవించి ఇంటికి వచ్చిన అనంతరం వాంతులు, విరోచనాలు అయ్యాయని తర్వాత నల్లగొండ, మిర్యాలగూడ, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేర్చగా 24వ తేదీ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షలు నిర్వహించి తుది మరణ కారణం వైద్యుల నివేదిక ఆధారంగా నిర్ధారిస్తామని హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు.

## పెన్షన్ వాలిడేషన్ చట్టం ఉపసంహరించుకోవాలి

హాలియా, ప్రభాతవార్త, మార్చి 25:



కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పెన్షన్ వాలిడేషన్ బిల్లును ప్రవేశపెట్టిందని తక్షణమే ఉపసంహరించుకోవాలని అనుముల మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పొందరయ్య అన్నారు. బుధవారం అనుముల మండల తహసీల్దార్ కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ చట్టం లక్షలాది మంది ప్రభుత్వ పెన్షనర్లకు పెనుభూతంలా మారిందని, పెన్షనర్లకు ముప్పు వాటిలో గొడ్డలి పెట్టు లాంటి చర్య ఇది అని అన్నారు. ఈ చట్టం ప్రకారం పెన్షనర్లను రెండు వర్గాలుగా విభజించారని 1.1.2026 కంటే ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఎలాంటి వేతన పెంపుదల లేకపోవడం కరువు బత్యాన్ని కూడా ఇవ్వకపోవడం, కేవలం వారి రిటైర్డ్ అయిన నాడు ఉన్న పెన్షన్ ను చెల్లించే విధంగా చట్టంలో రూపొందించారన్నారు. పెన్షనర్ల అస్తిత్వానికి ముప్పు వాటిల్లే చట్టంను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో టిఎస్ జిఆర్ వి ఏ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, సెక్రటరీ సాంబశివరావు, సీతా కళ్యాణి, కేశవరెడ్డి ,లక్ష్మి ృ, పెన్షనర్లు పుల్లారెడ్డి ,వెంకట్ రెడ్డి, అనిమిరెడ్డి, మారం రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

**నేరేడుచర్ల మార్చి 25 ప్రభాతవార్త**



ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ అన్నారు,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం నేరేడుచర్లలో అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన ప్రజలకు వివరించారు ,రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. డిఫెన్స్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమనిస్తానాలు చేరుకోవచ్చని సూచించారు

## సీతారాముల కళ్యాణ ఉత్సవానికి ముస్తాబవుతున్న ఆలయాలు

**నేరేడుచర్ల మార్చి 25 ప్రభాతవార్త**

శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నేరేడుచర్ల పట్టణము, మండలంలో ని రామాలయాలను ఆయా ఆలయ కమిటీలు ముస్తాబు చేస్తున్నారు, స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీ కోదండ రామాలయం, ప్రధాన కూడలి వద్ద గల అయోధ్య రామాలయం, పాత రామాలయం, శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయం లో, విద్యానగర్లోని రామాలయం, రామాపురం లోని రామాలయం, మండలంలోని దిర్శించర్ల లోని కోదండ రామచంద్రస్వామి ఆలయం, కందుల వారి గూడెం, పెంచికల్ దిన్న తదితర రామాలయాలలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ సిద్ధంగా నిర్వహించడానికి ఆలయ కమిటీలు భారీ ఎత్తున ఏర్పాట్లను చేస్తున్నారు, స్థానిక శ్రీ కోదండ రామాలయంలో ఈనెల 26న ఉదయం మామిడి తోరణం, పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాల సమర్పణ, స్వామిని పెళ్లి కొడుకు చేయడం, ఈనెల 27న సీతారాముల కళ్యాణం, అనంతరం అన్న ప్రసాద వితరణ,సాయంత్రం గరుడ వాహనంపై గ్రామోత్సవం, 28న శాంతి హోమము, నవగ్రహ హోమము, పూర్ణాహుతి, సాయంత్రం 700 గంటలకు



పవళింపు సేవ, పాత రామాలయంలో సీతారాముల కళ్యాణం అనంతరం అన్నదానము సాయంత్రం ఊరేగింపు, విద్యానగర్లోని రామాలయంలో కళ్యాణం అనంతరం అన్నదానము, శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు, ఆలయాలలో కళ్యాణ ఉత్సవాల అనంతరం బెల్లం పానకం పంపకం, తీర్థ ప్రసాదాల వినియోగము అన్న ప్రసాద వితరణ సాయంత్రం ఊరేగింపు నిర్వహించడానికి ఆలయ కమిటీలు సిద్ధం చేస్తున్నారు, ఇప్పటికే ఆలయాలకు రంగులు వేయడం, ఆలయాల ముందు షామియానాలు వేయడం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సరఫరా తదితర ఏర్పాటు చేయడంలో ఆలయ కమిటీలు నిమగ్నమైనారు,

## మై హోమ్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు

**మేళ్ళచెరువు మార్చి 25 ప్రభాతవర్త:**




స్థానిక మైహోమ్ ఇండస్ట్రీయస్ మహాసిమెంట్ పరిశ్రమకు బుధవారం హైదరాబాద్లో హైదరాబాద్ ఫోరం ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్ అధ్వర్యంలో నిర్వహించిన క్వాలిటీ సర్కిల్ అవార్డు కార్యక్రమాలలో మహాసిమెంట్కు రెండు ఉత్తమ అవార్డులు లభించాయి. ఈ సందర్భము గా పరిశ్రమ అధికారులను, ఉద్యోగులను, కార్మికులను ప్లాంట్ హెడ్ నందనమూడి శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమాలలో నిర్వహక అధికారులు, పరిశ్రమ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ లో కార్మిక వర్గానికి మొండి చెయ్యి

### సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



**హుజూర్ నగర్ టౌన్, మార్చి 25, ప్రభాత వార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్లో కార్మిక వర్గానికి మొండి చేయి చూపించిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ 2023 లో అధికారం లో వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయడం లో పూర్తిగా విఫలం చెందిందని విమర్శిం చారు. ఎన్నికల ముందు ప్రతి పక్ష నాయకుడిగా ఉన్న రేవంత్ రెడ్డి అంగన్ వాడి టీచర్స్ కనీస వేతనం 18 వేలు ఇస్తానని హామీ ఇచ్చారని ఇంతవరకు అమ లు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం లో అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్, గ్రామ పంచాయతీ వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్,ఆశ తో పాటు మధ్యాహ్న భోజన కార్మి కులు చాలిచాలని వేత నాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగం లో, షెడ్యుల్ పరిశ్రమల ల్లో పని చేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభు త్వం ఆదుకోవడంలో విఫలమైం దన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, ఆర్టీసీ ద్వారా విద్యుత్ అద్దె బస్సు లను ప్రభుత్వమే నడపాలనీ ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి కోటగిరి వెంకట నారాయణ అధ్యక్షత వహిం చగా జిల్లా కార్య దర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను,, వటేపు సైదులు, షేక్ యాకుబ్, రణపంగు కృష్ణా ము త్యాలు, యాతకుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణములు

**మేళ్ళచెరువు మార్చి 25 ప్రభాతవార్త**

స్థానిక శ్రీగోదాభూనీళసమేత శ్రీవెంకటేశ్వరస్వామి శ్రీదేవిభూదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో బుధవారం సంధర్భముగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణములు, కుంకుమార్చనలు, అభిషేకములు, ఆరాధనలు, హారతులు, దైవనామస్మరణభజనలు, గుడిసేవలు వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో సుధర్శనం ప్రసాదా చార్యులు, మోహనక్రిష్ణమాచార్యులు, నల్లాన్చక్రవర్తుల వెంకట ప్రసాదాచార్యులు, చెట్లూరి వాసుదేవాచార్యులు, బట్టర్ శేషుతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు హక్కులకు చట్టబద్ధత కల్పించాలి

**గరిడేపల్లి,మార్చి 25, ప్రభాతవార్త :**

ఆశా వర్కర్లకు కనీస వేతనం, చట్టబద్ధ హక్కులు కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ కె యాకుబ్ డిమాండ్ చేశారు. గరిడేపల్లి మండల వైద్యాధికారి నరేష్ కి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల కు కనీస వేతనం, హక్కులకు చట్టబద్ధత కల్పించాలంటూ కలమలచెరువు ఎక్స్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం రోజు ధర్నా చేయనున్నట్లు తెలిపారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18,000 ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లకు రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా పేదలకు నిరంతరం ఆరోగ్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారని అయినప్పటికీ వారికి చట్టబద్ధత,కనీస



సౌకర్యాలు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీస గ్యారంటీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో 15 రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు పెంచు తామని చెప్పి రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయలేదని యాకూబ్ ఆరోపించారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల కోసం రేపటి నుండి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కడప నాగమణి, సైదమ్మ,ఎం.ఉమా,పోలేపల్లి బువ్వమ్మ, స్వర్ణ, ధనలక్ష్మి, భవాని, ప్రమీల, పద్మలక్ష్మి, జయమ్మ, అశ్విని, వెంకటమ్మ,రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ, సూపర్ వైజర్లకు శిక్షణ

**హుజూర్ నగర్ టౌన్, మార్చి 25, ప్రభాతవార్త :**



ఎన్నికల సంఘం ఆదేశాలతో బుధవారం హుజూర్ నగర్ నియోజక వర్గంలోని 7 మండ లాలకు సంబంధించిన బిఎల్ వో, సూపర్ వైజర్ల కు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) గురించి అవగాహన సదస్సు హుజూర్ నగర్ పట్టణంలోని టౌన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భం గా నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఆర్ డి వో వి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతముగా తమ విధులను నిర్వర్తిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బి ఎల్ ఓ లు, సూపర్ వైజర్లు 2002 లో సేకరించిన విధంగా ఓటర్ లిస్టును మ్యాపింగ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బండ కవిత, తహసిల్దార్లు మ ఏ ఎల్ ఎం టి శ్రీనివాసులు పాల్గొన్నారు

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవార్త**



విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తాసిల్దార్ రవికుమార్ అన్నారు .బుధవారం తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలోని ఎస్టీ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనానికి ఉపయోగించే బియ్యాన్ని, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేనిచో తగిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జహంగీర్, హాస్టల్ వార్డెన్ స్వరాజ్యం, విద్యార్థులు పాల్గొన్నారు

## బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూలు విడుద ల

**హుజూర్ నగర్ క్రైమ్, మార్చి 25 , ప్రభాతవార్త :**

2026 27 సంవత్సరానికి హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ కు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ను ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య లు బుధవారం విడుదల చేశారు. ఈనెల 26 నుండి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 31వ తేదీన నామినేషన్ల పరిశీలన అదే రోజు చెల్లుబాటు అయిన అభ్యర్థుల జాబితా ప్రకటన, ఏప్రిల్ 1 వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, ఏప్రిల్ 9వ తేదీన ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు పోలింగ్ నిర్వహణ అనంతరం మధ్యాహ్నం 330 గంటల నుండి ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికలలో గెలుపొందిన వారి జాబితా ప్రకటన ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, గ్రంథాలయ కార్యదర్శి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి, ఐదుగురు కార్యవర్గ సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ మహోత్సవాలకు ముస్తాబైన ఆలయాలు





**బీబీనగర్, మార్చి 25 ప్రభాతవార్త**

:శ్రీ సీతా రామచంద్ర కళ్యాణ మహోత్సవం ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి (శ్రీరామనవమి) రోజున అత్యంత వైభవంగా జరుగుతుంది. మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవాలను నిర్వహిస్తారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం తో పాటు మండలంలోని కొండమడుగు శ్రీ సీతారామ లక్ష్మణ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అభిజిత్ లగ్నంలో సీతారాములకు పవిత్ర వివాహ వేడుక వందలాది భక్తుల నడుమ నేత్రపర్వంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నేటి నుండి జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తివాచనము అంకురార్పణము కలశస్థాపన అఖండ దీపారాధన ధ్వజారోహణము తో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 27వ తేదీ శుక్రవారం సీతా రామచంద్రుల ఎదుర్కోలు కార్యక్రమం అనంతరం పదకొండు 25 నిమిషాలకు పునర్వసు నక్షత్ర యుక్త అభిజిత్ నగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగును. అనంతరం సాయంత్రం మొక్కుబడి సేవలు తీయబడును. శనివారం తెల్లవారుజాము నుండి ఆంజనేయ స్వామి అభిషేకములు రుద్రాభిషేకములు నవగ్రహ పూజలు భక్తులు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం స్వామివారి మొక్కుబడి సేవలు తీయబడును. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారి విమానాలతోత్సవం భక్తుల కోలాటాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దాతల సహకారంతో భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సీతా రామలింగేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో గల సాయిబాబా ఆలయంలో బ్రహ్మోత్సవాల భాగంగా ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ గాండ్ల బాలరాజ్ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున శ్రీ సీతారామచంద్రుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# పేదలకు ఇందిరమ్మ గృహ పథకం ఒకవరం





**పెద్దవూర, మార్చి 25 ప్రభాతవార్త**

నిరుపేదల సంక్షేమం కోసం అమలు చేసిన ఇందిరమ్మ గృహ పథకం పేదలకు ఒక వరమని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహా ప్రవేశ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ గృహ పథకం ద్వారా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు త్వరితగతిగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బిల్లులు ఎప్పటికప్పుడు వెంటనే చెల్లిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హాలియామార్కెట్ చైర్మన్ తుమ్మల పల్లి శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరసన గండ్ల నరసింహారావు, ఎంపీడీవో ఉమాదేవి, గ్రామ సర్పంచ్ మెండే ముత్యాలు, ఉపసర్పంచ్ నక్కల నాగమ్మ మట్టారెడ్డి, వార్డు సభ్యులు నడ్డి సాంబయ్య , ఇరుమాది సరిత నర్సిరెడ్డి,, నిరోషా, కోటేష్,నాగలక్ష్మి మధు గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి వనమ్మ, వేణుగోపాల్, సాంబయ్య, మల్లయ్య, వెంకన్న, రవి, కిరణ్, రామకృష్ణ, మహేష్, కరుణాకర్, శ్రీహరి, సందీప్, విష్ణు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# హిందువుల ఐక్యతే సనాతన ధర్మ రక్షణకు పునాది

**గుండాల మార్చి 25 ప్రభాతవామ్తండలంలోని**

రామారం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హిందువుల ఐక్యతే సనాతన ధర్మ రక్షణకు పునాదిగా భావిస్తూ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ పూజారి వెంకట రాఘవాచార్యులు, తెలంగాణ రైతు సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఓర్స్ ఇంద్రసేన మాట్లాడుతూ, హిందువుల ఐక్యత కోసం "హిందువుల బతుకు భరోసా మూట" అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి వ్యక్తి జీవనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే మనసుకు ప్రశాంతత అవసరమని, ఆ ప్రశాంతత ఆలయాల్లోనే లభిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుత సమాజంలో మనుషుల మధ్య ధర్మం, విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కొంతమేరైనా ధర్మబోధ ఆలయాల ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని తమ



పుట్టిన గ్రామమైన రామారం నుంచే ప్రారంభిస్తున్నామని, ఇది అంచెలంచెలుగా అన్ని గ్రామాలకు విస్తరించి ప్రజల్లో దైవభక్తి పెంపొందించాలని ఆకాంక్షి ంచారు.ప్రతి ఒక్కరూ ఆలయాలను సందర్శించి మనశ్శాంతిని పొందుతూ, సనాతన ధర్మ సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుమ్మ ఆంజనేయులు, పరమేశ్వరి, సంగీత, ముక్కెర యాదయ్య, దొడ్డబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

**మోత్కూర్, మార్చి 25 ప్రభాతవార్త:**

ఎస్సీ కార్పొరేషన్ 202526 సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ దరఖాస్తుల స్వీకరణ గడువును ఏప్రిల్ 2, 2026 వరకు పొడిగించినట్లు ఎంపీడీవో బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా మోత్కూర్ మండలంలోని షెడ్యూల్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ యాక్షన్ ప్లాన్ కింద విద్యుత్ ద్విచక్ర వాహనాలు, విద్యుత్ మూడు చక్రాల వాహనాలు, సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ పరికరాలు, వ్యవసాయానికి సంబంధించిన ఇతర పరికరాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఏప్రిల్ 2లోపు ఆన్లైన్‌లో నమోదు చేసుకుని, దరఖాస్తు జిరాక్స్ కాపీతో పాటు కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలని సూచించారు. సంబంధిత పత్రాలను మోత్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో బాలాజీ కోరారు. అలాగే పాత్రికేయ మిత్రులు ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# అప్పులకే సరిపోతున్న ఆర్థిక సంఘం నిధులు

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త**

: జిల్లాలో గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారింది. ప్రతి నెల విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులు గ్రామాభివృద్ధి పనులకు వినియోగం కావాల్సి ఉండగా, ప్రస్తుతం అవి పూర్తిగా అప్పుల చెల్లింపులకే వెళ్తున్నాయి. దీంతో గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలే సంక్షోభంలో పడుతున్నాయి.ప్రధానంగా చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు, ఇతర వాహనాలపై తీసుకున్న రుణాల కిస్తులు పంచాయతీలకు భారంగా మారాయి. డీజిల్ ధరల పెరుగుదల, వాహనాల మరమ్మతులు, డ్రైవర్ల జీతాలుకలిసి నెలవారీ ఖర్చులను పెంచుతున్నాయి. ఇదే సమయంలో గత పాలకవర్గాల కాలంలో చెల్లించని విద్యుత్ బిల్లులు, నీటి సరఫరా బకాయిలు, కాంట్రాక్టర్లకు పెండింగ్ చెల్లింపులు లక్షల్లో పేరుకుపోయాయి.కొన్ని గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పంచాయతీ ఖాతాల్లోకి వచ్చే నిధులు నేరుగా బకాయిల చెల్లింపులకు మళ్లిపోవడంతో, కొత్తగా ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు మిగలడం లేదు. దీంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువల శుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి.పారిశుధ్య పరిస్థితి అధ్వాన్నంగా మారడంతో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దోమలు, దుర్వాసనలు పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు పనిచేయక రాత్రివేళ భద్రత సమస్యలు కూడా తలెత్తుతున్నాయి.కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు పాత బకాయిలను ముందుగా క్లియర్ చేయాల్సిందేనని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. కానీ అందుకు ప్రత్యేక నిధులు లేకపోవడంతో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల నుంచి పెరుగుతున్న ఒత్తిడితో సర్పంచ్‌లు చిక్కుముడిలో పడుతున్నారు.ఇంకా, పంచాయతీ కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతాలు, చిన్నపాటి మరమ్మతులు కూడా భారంగా మారుతున్నాయి. నిధుల లేమితో కొన్ని చోట్ల తాత్కాలికంగా సేవలను తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ పరిస్థితి కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మరింత దిగజారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత బకాయిలకు వేరు నిధులు కేటాయించడం, పంచాయతీలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడం, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అదనపు గ్రాంట్లు విడుదల చేయడం వంటి చర్యలు అత్యవసరంగా మారాయి.గ్రామాల అభివృద్ధి చక్రం మళ్లీ తిరగాలంటే తక్షణ ఆర్థిక సహాయం, స్పష్టమైన విధానాలు అవసరమని సర్పంచ్‌లు, ప్రజలు ఏకగ్రీవంగా కోరుతున్నారు. కొన్ని ఏళ్ల తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని 427 గ్రామ పంచాయతీలకు గాను ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యాయి. విడుదలైన నిధులు పాత బకాయిలకే కేటాయిస్తుండడంతో తాము ఎక్కడ అప్పులు తెచ్చి గ్రామ ప్రజల మౌలిక సమస్యలు ఎలా తీర్చగలుగుతామని పలు గ్రామాల సర్పంచ్లు ప్రభాతవార్తతో వాపోయారు

# మద్యానికి చెక్ పెట్టండి.

**గుండాల ,మార్చి 25 ప్రభాతవార్త:**

గుండాల మండలంలోని వెల్మజాల గ్రామంలో మద్యపాన సమస్య రోజురోజుకీ తీవ్రరూపం దాల్చడంతో మహిళలు ఒకటై పోరాటానికి సిద్ధమయ్యారు. గ్రామంలో విచ్చలవిడిగా సాగుతున్న మద్యపానం వల్ల కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతుండగా, గృహ కలహాలు, హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ మహిళా సంఘం సభ్యుల ప్రకారం, అనేక కుటుంబాల్లో సంపాదన మొత్తం మద్యం కోసం ఖర్చవుతుండడంతో పిల్లల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొంతమంది పురుషులు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యలు, పిల్లలపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని వారు తెలిపారు.ముఖ్యంగా గ్రామంలో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులు పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయని మహిళలు ఆరోపించారు. .ఇటీవల గ్రామంలో జరిగిన కొన్ని కుటుంబ వివాదాలు, గొడవలు మద్యపానం కారణంగానే జరిగాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామంలో శాంతి భద్రతల పరిస్థితి దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలో మహిళా సంఘం అధ్యక్షురాలు బొడ్డుపల్లి రేణుక ఆధ్వర్యంలో గ్రామ మహిళలు సమూహంగా సర్పంచ్ కుర్మిళ్ల కవిత శ్రీనుకలిసి వినతి పత్రం సమర్పించారు..అదనంగా గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని మహిళలు విజ్ఞప్తి చేశారు.గ్రామ అభివృద్ధి, మహిళల భద్రత, యువత భవిష్యత్తు దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ మహిళలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.మహిళల ఈ ఉద్యమానికి గ్రామస్థుల నుంచి కూడా మద్దతు పెరుగుతున్నట్లు సమాచారం.

## తండ్రి పేరును నిలబెట్టిన మహనీయుడు

**తుంగతుర్తి . మార్చి 25. ప్రభాతవార్త**

గ్రామ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించిన మహనీయుడు దాయం విక్రమ్ రెడ్డి అని సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య అన్నారు. బుధవారం వెంపటి లో దాయం విక్రమ్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.రాజకీయ కురువృద్రుడు, తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి చేసిన సేవలను తన పాటతో కనువిప్పు కలిగేలా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తన తండ్రి దాయం రాజిరెడ్డి పేరును నిలబెట్టే విధంగా ఎస్సీ కాలనీకి ఆయన పేరున రాజానగర్ కాలనీ ఏర్పాటు చేసి కాలనీ అభివృద్ధికి విక్రమ్ రెడ్డి చేసిన కృషి మరువలేనిదని అన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ఆయన చూపిన చొరవ, తన తల్లి దాయం శశిరేఖ రాజిరెడ్డి పేరున గ్రంథాలయాన్ని



ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన గొప్ప విద్యావేత్త అని కొనియాడారు. నవీన యువజన సంఘం ఏర్పాటు చేసి ఎంతోమంది క్రీడాకారులను గ్రామానికి అందించి గ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి

**తుంగతుర్తి . మార్చి 25. ప్రభాతవార్త**



నిబంధనల ప్రకారం వాహనాలను నడపాలని ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత పై డ్రైవర్లకు అవగాహన నిర్వహించి మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు తీసుకునే జాగ్రత్తలు శ్రీరామరక్ష అని ప్రతి ప్రయాణం సురక్షి త గమ్యాన్ని చేరుకోవాలని కోరారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. డిఫెన్స్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరగకుండా సురక్షి తంగా గమ్యస్తానాలకు చేరుకోవచ్చుని తెలిపారు. నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలని అన్నారు. పరిస్థితులను అంచనా వేస్తూ ముందుకు సాగాలని ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని ప్రమాదాలకు కారణం కాకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరికరాల అందజేత

**మోతె, మార్చి 25 ప్రభాతవార్త...**



ఎస్బిఐ పాన్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ శ్రీ లక్షీ ్మ రెడ్డి బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పలు పరికరాలను అందజేశారు.రోగుల సౌకర్యార్థం కుర్చీలు, వార్మర్, రాక్, కూలర్, బీపీ మిషన్, వెయిట్ మిషన్, వాల్ క్లాక్, స్టేచెర్, వీల్‌చైర్ ను ఉచితంగా అందించారు.ఆరోగ్య కేంద్రానికి అవసరమైన పరికరాలు అందజేయడం పట్ల వైద్యాధికారి భవాని, సిబ్బంది మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ శ్రీ లక్షీ ్మ రెడ్డిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ మోతె బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ గోపి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మభిక్షం విగ్రహావిష్కరణ, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపు

**మోత్కూర్ మార్చి 25 ప్రభాతవార్త,**

గీత పనివారల సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహావిష్కరణ కార్యక్రమం నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, తెలిపారు. బుధవారం మోతుకూరులో విలేకరులతో మాట్లాడుతూ,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరుకానున్నారని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, మండల అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ ప్రజలను అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు కొండమడుగు పశువుల సంత వేలం

**బీబీనగర్, మార్చి 25 ప్రభాతవార్త:**



మండలంలోని కొండమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో 2026 27 సంవత్సరానికి గాను పశువుల సంత రుసుము వసూలు బహిరంగ వేలము ను నేడు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి యావ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఉత్తర్వుల మేరకు 5వ సారి మధ్యాహ్నం రెండు గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు లక్ష రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ తో పాటు ఐదు లక్షల విలువ గల సాల్వెన్సీ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. ఉదయం 10:30 నుండి 12 గంటల వరకు డిమాండ్ డ్రాఫ్ట్ తో పాటు సాల్వెన్సీని గ్రామపంచాయతీలో అందజేసి రెండు గంటలకు జరిగే బహిరంగ వేలంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## నీటి ఎద్దడిని నివారించాలని కమిషనర్ కు వినతి

**భువనగిరి రూరల్ మార్చ్ 25 ప్రభాతవార్త**



భువనగిరి మున్సిపల్ పరిధిలోని 22,23 వార్డులలో నీటి కొరతను నివారించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్లు బర్రె పూజిత, జాలిగం విగ్నేష్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రామలింగం కు వినతి పత్రం అందజేశారు. వార్డులలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యవసర ఎజెండాలో పెట్టి పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బర్రె నరేందర్, ఐలాపురం బాబు,కరగాల రమేష్, క్రాంతి,బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడి ఇంటి ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం..

**మోత్కూర్, మార్చి 25 ప్రభాతవార్త:**

మోత్కూర్ పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్ర గౌడ్ నివాసం ఎదుట ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు,ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.మోత్కూర్ మండలం ముశిపట్ల శివనగర్‌కు చెందిన కోమటిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తనకు రావాల్సిన అప్పు డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రామచంద్ర గౌడ్ ఇంటి గేటు ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. డబ్బులు ఇచ్చేవరకు అక్కడి నుంచి వెళ్లనని గేటు ముందు పడుకుని నిరసన వ్యక్తం చేశాడు.బాధితుడి వివరాల ప్రకారం, 2022లో రామచంద్ర గౌడ్‌కు రూ.15 లక్షలు అప్పుగా ఇచ్చినట్లు తెలిపారు. 2023లో రూ.10 లక్షలు తిరిగి ఇచ్చినా, మిగిలిన రూ.5 లక్షలు ఆరు నెలల్లో ఇస్తానని కాగితం రాసి ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు చెల్లించలేదని ఆరోపించారు.ఈ ఆరోపణలపై స్పందించిన రామచంద్ర గౌడ్, ప్రభాకర్ రెడ్డి మద్యం సేవించి తన ఇంటి దగ్గరకు వచ్చి గొడవ చేసినట్లు తెలిపారు. తాను ఆ సమయంలో ఊర్లో లేనని, అతనికి రూ.2 లక్షలకుపైగా ఇవ్వాల్సి ఉందన్న విషయం వాస్తవమేనని పేర్కొన్నారు.

## ప్రభాకర్ ఉగాది పంచాంగ పఠనం

**హాలియా, ప్రభాతవార్త,మార్చి 25:**



సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త తెలుగు పండితులు రాచకొండ ప్రభాకర్ బ్రాహ్మణ వేషధారణలో వినూత్నంగా హాలియా పట్టణంలో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉగాది పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా శ్రీ స్వస్తిశ్రీ పరాబ ావనామ సంవత్సరములో ఏ రాశి కి చెందినవారైగంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలు అయితే అవమానము ఎక్కువ, రాజ్య పూజ్యము తక్కువ, వ్యయం ఎక్కువ కావడం జరుగుతుంది ఆదాయము తగ్గుతుందన్నారు. కావున మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే సమాజంలో రాజ్య పూజ్యం, గౌరవ మర్యాదలు పెరుగుతాయని, ఆదాయం పెరుగుతుందనీ, వ్యయము తగ్గుతుందన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే తీవ్ర ప్రమాదాలు జరిగి కుటుంబాలకు ప్రాణ నష్టం వాటిల్లి తీరని శోకం కలుగుతుందనీ, కావున యువత దుర్వ్యసనాలకు బానిసలు కాకుండా ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళికాబద్ధంగా కష్టపడి లక్ష్యాన్ని సాధించి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ భాషిపంగు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వశక్తితో ఎదగాలి

**సూర్యాపేట టౌన్, మార్చి 25, ప్రభాతవార్త:**



నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వసక్తితో ఎదగాలని ఆర్ట్స్ అసోసియేష అధ్యక్షులు గుడ ుగుంట్ల గోవర్ధన్ గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక రామలింగేశ్వర టాకీస్ లైన్లో తరుణ్ ఆర్ట్స్ షాప్ ను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వసక్తితో ఎదగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ యూనియన్ సభ్యులు నసీర్ బాయ్, శ్రీను, అలీ, భవాని, మనో, కీర్తి సతీష్, విష్ణు,సత్తి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ వ్యాలిడిషన్ చట్టాన్ని రద్దు చేయాలి.

**తుంగతుర్తి . మార్చి 25. ప్రభాతవార్త:**



తీవ్ర నష్టాన్ని కలిగించే పెన్షన్ వ్యాలిడిషన్ చట్టం2025ను కేంద్రం ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలంటూ బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పాలవరపు సంతోష్ మాట్లాడుతూ ఈ పెన్షన్ విధానంతో తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. జనవరి ఒకటి 2026 కంటే ముందు ఉద్యోగ విరమణ పొందిన వారిని, ఆ తర్వాత విరమణ పొందిన పెన్షనర్లను వేర్వేరుగా విభజించి ,వేతన సవరణ సంఘం సిఫారసుల ప్రయోజనాలు ఉంటాయని చెప్పడం అనుమానాలకు దారితీస్తుందన్నారు. కేంద్రం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పెండింగ్ డిఏల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ధర్నాకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య, రమేష్ గౌడ్ సంఘీభావం తెలిపారు. అనంతరం తహశీల్దార్ దయానందంకు వినతిపత్రం అందించారు.

## గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

**గుండాల, మార్చి 25 ప్రభాతవార్త:**

ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలో సీటు సాధించి గ్రామానికి గౌరవం తెచ్చిన వంగాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చిప్పలపల్లి మోక్షి త, చిప్పలపల్లి యక్షలను గ్రామ సర్పంచ్ చిప్పలపల్లి యాదమ్మ నరసింహ ఘనంగా సన్మానించారు. సి ఆర్ పి దేవన బోయిన లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనూ నాణ్యమైన విద్య లభిస్తుందని ఈ విద్యార్థులు సాధించిన గురుకుల సీట్లే నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె సూచించారు.పాఠశాల హెడ్మాస్టర్ కే మోనికను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిప్పలపల్లి జానీ, వేగం రవిశంకర్, ఉప సర్పంచ్ జటంగి నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి జి అనిత, వార్డ్ మెంబర్ చిప్పలపల్లి సోమ నరసయ్యతో పాటు గ్రామ పెద్దలు చిప్పలపల్లి నరసింహ, సోమన్న, స్వామి, వీరబోయిన లింగమల్లు, గణేష్, రవిశంకర్, శ్రావణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో నిందితురాలికి పది లక్షల జరిమానా

.కోదాడ, మార్చ్ 25, ప్రభాతవార్త:



పట్టణంలోని మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు చెక్ బౌన్స్ కేసులో బుధవారం తీర్పు వెలువరించింది. నిందితురాలు కొప్పుల కామేశ్వరమ్మ కి రూ. 10 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. మునగాల మండలం నర్సింహపురానికి చెందిన వేమారి సత్యనారాయణ వద్ద 2017లో కామేశ్వరమ్మ రూ. 5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. తిరిగి చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదుదారుని తరపున న్యాయవాది డి. నాగార్జున రావు వాదనలు వినిపించారు. తీసుకున్న మొత్తానికి రెట్టింపు పది లక్షలు చెల్లించాలని, లేనిపక్షంలో నాలుగు నెలల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి ఆదేశించారు.

## షాట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

.కోదాడ, మార్చ్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్గమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇంటి యజమాని కొండా వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే తమ పనుల నిమిత్తం బయటకు వెళ్ళగా ఆ సమయంలో ఇంటిలో షార్ట్ సర్క్యూట్ వలన అలుముకున్న మంటలకు ఇంట్లో సామాగ్రి మొత్తం కాలిపోయినట్లు తెలిపాడు. ఈ సామాగ్రి లక్ష రూపాయల వరకు ఉంటుందన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం తో ప్రాణ నష్టం జరగలేదు. ఇంట్లోని సామాగ్రి విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

మునగాల ,మార్చి 25 , ప్రభాతవార్త



:రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పెడితే ఇరువురి గెలుపు అని కక్షి దారులు సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ కోరారు. ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని, కక్ష కారుణ్యాలతో ఏమీ సాధించలేమన్నారు. కొట్టుకుంటే ఒకరే గెలుస్తారని, రాజీ పడితే ఇద్దరు గెలుస్తారన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీపడ దగిన కేసులో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులలో కక్షి దారులు రాజీ పడాలని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృధా చేసుకోవద్దని, జ్యుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## సర్టిఫికెట్లు, స్టైఫెండ్ అందజేత

నడిగూడెం, మార్చి 25, ప్రభాతవార్త :

మండలంలోని కరివిరాల ఆదర్శ పాఠశాల లో ఇంటర్మీడియట్ వృత్తి విద్యలో భాగంగా రిటైల్ రంగంలో 10 రోజులపాటు ఇంటర్న్షిప్ చేసిన విద్యార్థులకు స్టైఫండ్ , సర్టిఫికెట్లు బుధవారం అందజేశారు. ఈ కోర్స్ తో విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి , విషయ పరిజ్ఞానం పై పూర్తి అవగాహన కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయిఈశ్వరి ఒకేషనల్ ట్రైనర్ మధు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ముందస్తు బడిబాట కార్యక్రమం



కోదాడ టౌన్ మార్చి 25 ప్రభాతవార్త.

ప్రజా పాలన ప్రణాళిక ప్రగతి కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ మండల ఎంఈఓ సలీం షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి,,వికాసం పొందుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధతో విద్యాభివృద్ధికి మెరుగైన సౌకర్యాలు మధ్యాహ్న భోజనం, స్కూలు యూనిఫామ్, ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేస్తు ప్రాథమిక విద్య నుండి ఉన్నత స్థాయి విద్య వరకు అందరికీ అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. 2026 27 విద్యాసంవత్సరాలన్నీ గాను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మార్కండేయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ను కలిసిన కాంగ్రెస్ నేత.

.తంగళ్ళపల్లి, ప్రభాతవార్త.



తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లను ఇందిరమ్మ కాలనీ సర్పంచ్ భర్త గడ్డం మధుకర్ (చోటు) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలని గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను మంత్రి, విప్ లకు చోటు విన్నవించారు. అనంతరం సర్పంచ్ గడ్డం రచన చోటు ను శాలువాతో ఇరువురు నేతలు సత్కరించారు..

## గ్యాస్ వినియోగదారుల జేబులకు చిల్లు.

జేబులు నింపుకుంటున్న డెలివరీ బాయ్స్ నిబంధనలకు నీళ్ల వదిలిన అధికారులు

..కృత్రిమ కొరతతో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు.

ఆత్మకూర్ మార్చి 25 ప్రభాతవాన్తిత్యం

ప్రజలు వినియోగించే గ్యాస్ గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో కృత్రిమ గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దానికి తోడు డెలివరీ బాయ్స్ వ్యవహారంతో ప్రజలను భయం వెంటాడుతుంది. అధికారులు గ్యాస్ కొరత లేదని బహిరంగంగా ప్రకటిస్తున్నప్పటికీ వినియోగదారులు మాత్రం ముందస్తుగానే ఎలాంటి ఇబ్బందులు పడద్దని గ్యాస్ ను బుక్ చేసుకుంటున్నారు. ఇదే అదునుగా గ్యాస్ డీలర్లకు సంబంధించిన ఆటో డెలివరీ బాయ్స్ (సిబ్బంది) గ్యాస్ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఎడాపెడా అక్రమ వసూళ్లు చేసి వినియోగ దారుల జేబులకు చిల్లులు పెడుతూ గ్యాస్ డెలివరీ బాయ్స్ తమ జేబులు నింపుకుంటున్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినియోగ దారుడు గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకుంటే తన సెల్ ఫోన్ కు వచ్చిన ఓటీపీ ఆధారంగా రెండు మూడు రోజుల్లో సంబంధిత డీలర్లు గ్యాస్ సరఫరా చేసేవారు. ప్రస్తుతం మండల కేంద్రంలో గ్యాస్ బుక్ చేసుకుంటున్నా వినియోగ దారులకు ఓటిపి వచ్చినా గ్యాస్ వచ్చే సరికి పది రోజులు పడుతుందని గ్యాస్ డీలర్లు చెబుతున్నారు. వినియోగదారుల భయాన్ని డెలివరీ బాయ్స్ (సిబ్బంది) క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బుక్ చేసి 20 రోజులు దాటిన గ్యాస్ రాలేదు**

సిలిండర్ బుక్ చేసి 20 రోజులు దాటిన గ్యాస్ ఇంటికి డెలివరీ రాలేదు. ఆత్మకూర్ హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ ఆఫీస్ వద్దకే వచ్చి తీసుకున్నానను

**ఓదెల శివ బాధితుడు**

అధికారుల తనిఖీలు ఎక్కపారసరఫరాల అధికారులు మండల కేంద్రంలో ఉన్నారా అనే అనుమానాలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డొమెస్టిక్ సిలిండర్లను హోటల్ నిర్వాహకులు వినియోగించవద్దని నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడ చూసినా హోటల్ నిర్వాహకులు డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోను హోటలల్స్ పై ఇప్పటివరకు తనిఖీలు చేసి చర్యలు తీసుకున్న సంఘటనలు కనబడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే జిల్లా అధికారులు కృత్రిమ గ్యాస్ కొరత లేకుండా ప్రజల భయాన్ని తొలగించాలని కోరుతున్నారు

## పరిమితికి మించి ప్రయాణం

( పరకాల ప్రభాతవార్త

)పరకాల ప్రాంతంలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే అపార ప్రాణ నష్టం జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లోని పంటచేలు, పొలాల్లో, తోటల్లో పని చేయడానికి ఎవరూ లభించక దొరకక పోవడంతో ఇతర గ్రామాల నుంచి శ్రమజీవులను తరలిస్తున్నారు. తెల్లవారుజామునే లేచి వంట వార్పు చేసుకొని సద్ది కట్టుకొని పంటచేలకు చేరుకుంటున్నారు. మరికొందరు సాయంత్రం వేళ దాకా పనుల్లో పాల్గొంటున్నారు. ఒక్కొక్క ట్రాలీ ఆటో, ప్రయాణికుల ఆటోల్లో 20 మంది దాకా కిక్కిరిసి కూర్చొని, నిలబడి ప్రయాణించి గమ్యానికి చేరుకుంటున్నారు. అసలే వ్యవసాయ ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా ఉంటాయి. అదే చినుకు పడితే చిత్తడిగా మారుతుంటుంది. ప్రమాదం అంచుల్లో వారు గమ్యానికి చేరుకుని పనులు చేయడం గమనార్హం. ఎంత జాగ్రత్తగా ఉన్న ఎదురుగా వచ్చే వాహనం అంతే అప్రమత్తంగా వస్తుందని అనుకోవడం కూడా ఊహించని ప్రమాదాలను తెచ్చిపెడుతున్న సందర్భాలు ఉన్నాయి. అసలే తెల్లవారుజాము ప్రయాణం డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నా అనర్థం జరగవచ్చని పలువురు అంటున్నారు. ఈ విషయంలో అధికారులు ఆజమాయిషి లేకపోవడం గమనార్హం. అదే శ్రమజీవుల పాలిట శాపంగా పరిణమించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి

## రోడ్డు భద్రతపై అవగాహన

ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఆత్మకూర్, ప్రభాతవార్త మార్చి 25:

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ సీఐ సంతోష్ తన సిబ్బందితో కలిసి గూడెప్పాడ్ సెంటర్లో "అరైవ్ అలైవ్" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన రోడ్డు భద్రతా నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణాపాయం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం వల్ల ఎదురయ్యే ప్రమాదకర పరిస్థితులు, అధిక వేగంతో ర్యాష్ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు వంటి అంశాలను ఉదాహరణలతో వివరించారు. అలాగే ట్రిపుల్ రైడింగ్ చేయడం, మైనర్ పిల్లలు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం ఎంత ప్రమాదకరమో స్పష్టంగా తెలియజేశారు. ఈ నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా మరో కీలక చర్యగా నేషనల్ హైవే163 పై ప్రమాదాలకు అధికంగా గురయ్యే ప్రాంతాలను గుర్తించి, పత్తిపాక క్రాస్, దర్గా, గ్యాస్ సెంటర్ ప్రాంతాల్లో మూడు యాక్సిడెంట్ జోన్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ బోర్డులు వాహనదారులకు ముందస్తు హెచ్చరికగా ఉండి, వేగం నియంత్రించుకోవడానికి సహాయపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రాణ భద్రత మన చేతుల్లోనే ఉందని అన్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

మార్చి 25, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్



:ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. న్యూశాయంపేట పరిధి పోచంపల్లిలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 2వ రోజు 50 మంది వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలిద్దాం పచ్చదనాన్ని పెంచుదాం, ప్లాస్టిక్ వద్దు ప్రాణాలు ముద్దు, ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావరణాన్ని రక్షి ద్దాం అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి మనకు ఇచ్చిన వరమని, అయితే మన అలవాట్ల కారణంగా భూమి ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం వల్ల భూమిని, జలాలను, జంతువులను నాశనం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, గీతరాణి, డాక్టర్ విమల, జీ పి ఎస్ హెచ్.ఎమ్ ఉప్పలయ్య పాల్గొన్నారు.

## చిన్న మేడారం జాతరలో దాడి చేసిన ముద్దాయిలు అరెస్ట్

రాజాపేట, మార్చి 25 ప్రభాతవార్త

రాజాపేట మండలంలోని చిన్న మేడారం జాతరలో ఇటీవల దాడి చేసిన ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై లింగారెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మెగా రోహిత్ అను వ్యక్తి తన కుటుంబం తో జనవరి నెలలో రాజాపేట మండలం కుర్రారం గ్రామం లో జరిగిన చిన్న మేడారం జాతరకి రాగా అక్కడ కొంత మంది యువకులు రోహిత్, అతని కుటుంబ సభ్యులతో గొడవకి దిగి కొట్టి గాయపరిచారని పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా రాజాపేట ఎస్ ఐ వై. లింగా రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాధితుల మెడికల్ సర్టిఫికేట్ రాగా, పాముకుంట, బొందుగుల గ్రామానికి చెందిన రంగా చందు ,బొచ్చు సాయి ,బత్తిని వర్షిత్,అంబాల సాయి,అనుప పరుశరాములు,ఉప్పరి అజయ్, బోయిని పవన్,పంతం నవీన్,చీర బాలకృష్ణ,దువ్వాల అజయ్ ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టు ముంధు హాజరు పర్చినట్లు తెలిపారు. జడ్జి రిమాండ్ విధించగా ముద్దాయిలను భువనగిరి సబ్ జైల్ కి తరలించడం జరిగినదని ఎస్సై లింగారెడ్డి తెలిపారు.

## స్వామి అమ్మవార్లకు విశేష పూజలు

యాదగిరిగుట్ట మార్చ్ 25 (ప్రభాతవార్త ):





యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి అమ్మ వార్ల కు విశేష పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి అమ్మవార్లకు పంచామృతా లతో ఆలయ అర్చకులు చదివే వేదమంత్రాలుతో అభిషేకం గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు గర్భాలయంలో వివిధ రకాల పుష్ప మాలికల తో శోభాయమానం గా అలంకారం చేసి విశేష కళ్యాణం ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే సాయంకాలం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై అధిష్ఠంపజేసి మంగళ వాయిద్యాలతో ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు చేశారు. ఆలయంలో జరిగిన కళ్యాణోత్స వానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సుమారు గంట పాటు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరు వెంకటాచార్యులు, సురేంద్ర ఆచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, మాధవాచార్యులు,ఆలయ అధికారులు ఏఈఓ రఘు, చంద్రమోళి,అర్చకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మీ ఊరికే వచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తాం

రాజాపేట మార్చి 25 ప్రభాతవార్త



యాదాద్రి భువనగిరి జిల్లాలో కుట్టు మిషన్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు ఫోన్ చేస్తే ఆ ఊరికే టీచర్ వచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తుందని శ్రీ శక్తి ఇన్స్టిట్యూట్ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాజపేట మహిళ సమైక్య భవనం లో కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఊరిలో ప్రతి ఒక్క మహిళకు నిరుద్యోగ యువతకు కుట్టు మిషన్ నేర్పించాలనేది తన ఆశయమని ఆకలితో ఉన్నవారికి ఒక పూట అన్నం పెట్టగలం కానీ మనకు వచ్చిన విద్య పంచితే ఆ కుటుంబానికి జీవితకాలం అన్నం పెడుతుందన్నారు. తన వంతు సహాయం గా ఎంతో కొంత మందికి సేవ చేయనున్నట్లు తెలిపారు. నవనీత నరేందర్ ఫోన్ నెంబర్ 9014514780, 9701679824 కుట్టు మిషన్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు ఫోన్ చేయాలని, 15 మంది నుండి 30 మంది ఉంటే అదే గ్రామానికి టీచర్ వచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజపేట సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ నెమల కేదారి, దాచేపల్లి రాజు, నెమల మహేందర్ గౌడ్, గుర్రం నరసింహులు, పాండవుల బసవయ్య, భరత్, మహేష్, నాని, రేగు సిద్దులు పాల్గొన్నారు.

## రైతులకు వెన్నుదన్నుగా సహకార సంఘాలు

ఆలేరు, మార్చి 25, ప్రభాతవార్త :




ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రాథమిక సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆఫీస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆలేరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీఈఓ వెంకట్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని అన్నారు. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, విత్తనాలు, ఎరువులు అందించడంలో సంఘాలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సాంకేతికతను అనుసంధానించి పారదర్శకతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నాయని ఆయన కొనియాడారు. రైతుల అభివృద్ధి కోసం సహకార సంఘాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో మాజీ డైరెక్టర్ గవ్వల నర్సింహులు, అరె మల్లేశం, దరెడ్డి శేఖర్ రెడ్డి, మంతపురి గ్రామ సర్పంచ్ పసుల సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ దంతూరి స్వామి, రైతులు నర్సింహులు, బాలయ్య, సిబ్బంది ప్రభాకర్, సంజయ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సీఈవో శోభారాణి

యాదగిరిగుట్ట మార్చ్ 25 (ప్రభాత వార్త ):



యాదగిరిగుట్ట ఎంపీడీవో ఆఫీసు పంచాయతీరాజ్ శాఖ సీఈవో శోభారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీ లించారు అలాగే ఉపాధి హామీ పనులపై హామీ ఆరా తీశారు.

## జిల్లా సర్పంచుల ఫోరం ప్రచార కార్యదర్శిగా చౌక్లా తండా సర్పంచ్

తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవార్త




జిల్లా సర్పంచుల ఫోరం ప్రచార కార్యదర్శిగా తుర్కపల్లి మండలం చోక్ల తండా సర్పంచ్ భుక్య రాజారామ్ నాయక్ నియమితులైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు,సర్పంచ్ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సోదాని భూమన్న కు, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అన్నారు. అనునిత్యం సర్పంచుల సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి,, సర్పంచులు పాల్గొన్నారు

## 6వ వార్డును అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

**ఆలేరు, మార్చి 25, ప్రభాతవార్త :** ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు బహదూర్‌పేటను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ తెలిపారు. బుధవారం నిర్వహించిన మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి 6వ వార్డులోని పలు కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, పారిశుద్ధం, శానిటేషన్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.అనంతరం పులి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, వార్డు అధ్యక్షులు వట్టిపల్లి శ్రీనివాస్, కుళ్ల సిద్దులు, వట్టిపల్లి సిద్దిరాజు,లక్ష్మణ్, ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు ఉతా పవన్, పర్ష నరేష్,కుళ్ల జహంగీర్,ఎండీ సలీం, ముదికొండ శ్రీకాంత్, దూడలా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బకాయి ఆస్తి పన్నులపై మున్సిపాలిటీ కఠిన చర్యలు

ఆలేరు, మార్చి 25, ప్రభాతవార్త :



కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల వసూళ్లలో భాగంగా గత సంవత్సరం , ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయి పన్నులు చెల్లించని వారికి మున్సిపాలిటీ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. పన్నులు చెల్లించని వారికి వారంలోపు చెల్లించాల్సిందిగా రెడ్ నోటీసులు జారీ చేయగా, గడువు ముగిసిన నేపథ్యంలో ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని పలు బకాయిదారుల ఆస్తులను బుధవారం సీజ్ (జప్తు) చేశారు..ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. ఆలేరు పట్టణ ప్రజలందరూ తమ ఆస్తి పన్నులు సమయానికి చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఈ వెంకటేష్, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎస్. స్వామి, బిల్ కలెక్టర్లు బాబు, నాగేందర్, వార్డ్ ఆఫీసర్ పవన్ కళ్యాణ్, మున్సిపల్ సిబ్బంది ఏలియా, సుదీర్, లింగయ్య, అన్వర్, అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై శిక్షణ శిబిరం

**తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవార్త** తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సూపర్వైజర్లు, బిఎల్ఓ లకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో ఏప్రిల్ నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఓటర్కు బిఎల్ఓ లు ఎన్యుమరేషన్ రెండు ఫారాలను అందజేస్తారని తెలిపారు. మూడు రోజుల్లో రెండు ఫారంలను బి ఎల్ వో లు పూర్తిగా నింపి ఒక ఫారం ను ఓటర్కు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంపై మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జహంగీర్ ,మాస్టర్ ట్రైనర్లు, బిఎల్వోలు పాల్గొన్నారు

# ఏపూర్‌లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

## రాత్రివేళల్లో బెల్ట్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

## మద్యం విక్రయించొద్దని హెచ్చరిక

**చిట్యాల రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే దుకాణాల్లో అక్రమ మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని, ఒకవేళ అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏపూర్ గ్రామ సర్పంచ్ పాలెం మహేష్ గౌడ్ హెచ్చరించారు. గ్రామంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో సోమవారం రాత్రి ఉపసర్పంచ్ ఉప్పుల సైదులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులతో కలిసి బెల్ట్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామంలో బెల్ట్ దుకాణాల నిర్వాహకులు మద్యం విక్రయించొద్దని కఠినంగా హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, కలహాలు పెరుగుతాయని తెలిపారు. గ్రామంలో బెల్టు షాపులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ నెల 4వ తేదీన నోటీసులు జారీ చేశామని, ఇటీవల కూడా మరోసారి హెచ్చరించినప్పటికీ కొందరు పట్టించుకోకపోవడం విచారకర మన్నారు. ఇకపై హెచ్చరికలను లెక్కచేయకుండా మద్యం విక్రయిస్తూ కొనసాగిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ ప్రజలు కూడా ఈ విషయంలో సహకరించి అక్రమ విక్రయాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు వలిగొండ పద్మ, మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

చిట్యాల రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :



చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన తోటకూరి ఎల్లయ్య ఈనెల 19న అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ మర్రి జలెందర్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాధిత కుటుంబానికి 150 కిలోల బియ్యం అందజేశారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన చైర్మన్ బాలగోని రాజు గౌడ్, మాజీ దేవస్థానం డైరెక్టర్ ఆవుల జానయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ పొట్లపల్లి చిన్నస్వామి గౌడ్, ఏర్పుల సత్తయ్య పాల్గొన్నారు.

# ధర్మభిక్షం వర్ధంతిని విజయవంతం చేయాలి

## ...ఎరుకల నిరంజన్

మర్రిగూడ, మార్చి25, ప్రభాతవార్త:



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గీతా పనివారల సంఘం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మర్రిగూడ విలేకరులతో మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి – గీసేవాడిదే చెట్టు" అనే నినాదంతో కార్మికుల హక్కుల కోసం ధర్మభిక్షం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. ప్రజల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయనను కొనియాడారు. ధర్మభిక్షం ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేడు మర్రిగూడ మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ సమీపములో ఉన్న ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమంలో గౌడ సోదరులు, ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన

కొండమల్లేపల్లి, మార్చి25, ప్రభాతవార్త:



కొండమల్లేపల్లి మండలం పిఏపల్లి మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన 7గురు విద్యార్థులు గురుకుల సీట్లు సాధించడంతో బుధవారం ఎన్.ఎస్.యు.ఐ కొండమల్లేపల్లి మండల నాయకులు గుండాల రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించి వారికి డిక్షనరీలను అందించారు. ఈ సీట్లు సాధించడంలో కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు తులసి, సంతోషిలను శాలువాతో సత్కరించారు. .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్.ఎస్.యు.ఐ దేవరకొండ నియోజకవర్గ నాయకులు సర్పంచ్ రమావత్ సేవ నాయక్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు తల్లితండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, నాణ్యమైన విద్యను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ నేతృత్వంలో నియోజక వర్గంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు మెరుగ్గా ఉన్నాయని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారు అన్నారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే బాలునాయక్ యొక్క సహకారంతో అన్ని పాఠశాలలో అన్ని వసతులు ఏర్పాటుకు, సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఏపల్లి యువకులు రమేష్, శ్రీను, శ్రీశైలం, మహేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం

మర్రిగూడ, మార్చి25, ప్రభాతవార్త:



మర్రిగూడ మండలం కొట్టాల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు గంట అంజయ్య, ఎంపీడీఓ మునయ్య, హౌసింగ్ ఏఈ ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి షేక్ సయ్యద్, సర్పంచ్ కల్లెట్ల లింగయ్య, ఉప సర్పంచ్ జనగం నర్సిహ్మ, వార్డు సభ్యులు గంట రాజు, మెతరి సైదులు, బుర్ర రమణమ్మ, గంట సంతోష, కొలుగురి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

**తుర్కపల్లి, మార్చి 25 ప్రభాతవార్త** అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిరావత్ రమేష్ అన్నారు. లంబడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి తుర్కపల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజనులకు తీవ్ర న్యాయానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించిన తెలిపారు. సంతు సేవాలాల్ మహారాజ్ పేరు పైన హైదరాబాదులో యూనివర్సిటీ నిర్మించాలని సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు రోజుగా ప్రకటించాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు నరేందర్ నాయక్, మండల అధ్యక్షుడు మాలోతు రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు తిరుపతి నాయక్ ,భూక్య శ్రీకాంత్ నాయక్ ,భూక్య కృష్ణ నాయక్ లు ఉన్నారు



# 29న శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం

మర్రిగూడ, మార్చి25, ప్రభాతవార్త:

మండలంలోని ఎరుగండ్లపల్లి గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం ఈనెల 29న ఆదివారం రోజున నిర్వహించబడునని ఆలయ పూజారి మంచన హరిబాబుశర్మ గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణం, 28న రేణుక ఎల్లమ్మ కళ్యాణం జరిగే ఉత్సవాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

# సంత వేలంలో రైతులకు అన్యాయం జరిగింది

## ...జనసేన పార్టీ సీనియర్ నాయకులు

**కొండమల్లేపల్లి, మార్చి25, ప్రభాతవార్త:** కొండమల్లేపల్లి పశువుల సంత వేలంలో రైతులకు అన్యాయం జరిగిందని అంటూ జెనసేన పార్టీ సీనియర్ నాయకులు బుధవారం రైతులపక్షాన అధికారుల నిలదీశారు. దీంతో వారిని పోలీసులు అరోస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొర్ర చందు నాయక్ మాట్లాడుతూ పశువుల సంత వేలం సందర్భంగా రైతులకు జరగాల్సిన న్యాయం జరగకపోవడంతో జనసేన పార్టీ రైతులు పడుతున్న గోసను రైతుల పక్షన అధికారులకు నిలదీయగానే కొండమల్లేపల్లి పోలీస్ అధికారులు ఇష్టానుసారంగా లాక్కెల్లి పోలీస్ స్టేషన్‌కి తరలించారని ఆరోపించారు. రైతుల పక్షాన మాట్లాడి నందుకు పోలీస్ అధికారులు దారుణంగా వ్యవహరించడం అన్యాయ మన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన డబ్బు రానివ్వకుండా మధ్యలో అధికారులు కుమ్మకై ప్రభుత్వం గండి కొట్టడం జరిగిందని, ప్రభుత్వానికి రావాల్సిన సొమ్మును రాబట్టి ఇప్పుడు జరిగిన వేలంలో రైతులకు న్యాయం జరగాలన్నారు. 100కు 5 కాకుండా 100కు రూపాయి చిట్టి ఇవ్వాలని, రైతులకు షెడ్డు, వాటర్ ఐదు రూపాయల భోజనం, రైతుల దగ్గర ఉన్న నగదుకి రక్షణ ఆవు గాని మేక పోయిన వేలం దక్కించుకున్న వారు రైతులకు ఆదుకోవాలనిలేనియెడల సంత జరగనివ్వకుండా రైతుల పక్షాన ప్రతి సంతకు జనసేన పార్టీ ధర్నా నిరసన తెలుపుతుందని చందు నాయక్ అన్నారు. అరెస్టు అయినవారిలో కొర్ర చందునాయక్, కొత్తగొల్ల నరేష్ ఉన్నారు.

# మృతురాలు కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కు అందజేత

హుజూర్ నగర్ రూరల్, మార్చి25, ప్రభాతవార్త:



హుజూర్ నగర్ మండలంలోని అమరవరం లో విద్యుత్ఘాతంతో మృతి చెందిన మహిళ కుటుంబసభ్యులకు బుధవారం గ్రామ సర్పంచ్ కర్నాటి శిరీష వీరనాగిరెడ్డి ప్రమాదబీమా చెక్కు అందజేసారు. గతేడాది మండలంలోని అమరవరం లో బూర్గుల నాగమణి ఇంట్లో బట్టలు అరెస్తుండగా కరెంట్ షాక్కు గురై ప్రమాదవశాత్తు మృతి చెందింది . తెలంగాణ విద్యుత్ సంస్థ నుంచి మంజూరైన ఐదు లక్షల రూపాయలు చెక్కును నాగమణి భర్త వెంకన్న కు అందించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ వీర నాగిరెడ్డి, కార్యదర్శి చంటి ,వార్డ్ మెంబర్లు కొప్పుల నరసింహారెడ్డి ,పొట్టేపంగు పిచ్చమ్మ ,పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డిసి సైదిరెడ్డి ,కాకునూరి నర్సిరెడ్డి ,చొప్పర శ్రీనివాస్ , కదిర సైదిరెడ్డి ,వెంకటేశ్వర్లు, కందుల సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

కట్టంగూర్, మార్చి 25, ప్రభాతవార్త,

తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారి గీత కార్మికుడు కింద పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కట్టంగూర్ లో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి కట్టంగూర్ గౌడ సంఘం అధ్యక్షులు కొంపెల్లి యాదయ్య గౌడ్, 3వ వార్డు సభ్యులు ఐతగోని సైదులుగౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం కట్టంగూరు చెందిన చౌగోని వెంకన్న గౌడ్ కురుమర్తి రోడ్ లో గల తన వ్యవసాయ బావి సమీపంలో రోజువారి మాదిరిగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కింద పడిపోయాడు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.